ఉష్ణోగ్రత (అంచనా)

27-6-2025	గరిష్టం	కనిష్టం
గుంటూరు	36	26
తెనాలి	36	27
నరసరావుపేట	36	26
బాపట్ల	36	27
రెంటచింతల	35	27
చీరాల	36	28


మాదక ద్రవ్యాలకు వ్యతిరేకంగా ప్రతిజ్ఞ చేస్తున్న సీఎం చంద్రబాబు



సభలో ప్రసంగిస్తున్న సీఎం చంద్రబాబు

ప్రజా చైతన్యంతోనే.. డ్రగ్స్ కట్టడి

- శాటిలైట్, డ్రోన్ల నిఘాతో గంజాయి నియంత్రణ
- ముఠా కక్షలను అణచివేసినట్లుగా మాదకద్రవ్యాలపై దృష్టి
- మాదక ద్రవ్యాల దుర్వినియోగం... అక్రమ రవాణా దినోత్సవ సభలో సీఎం చంద్రబాబు
- ప్రజాప్రతినిధులు, విద్యార్థులతో కలసి గుంటూరులో వాక్‌థాన్

గుంటూరు, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): ప్రజా చైతన్యంతోనే డ్రగ్స్, గంజాయి కట్టడి చేయగలమని ముఖ్యమంత్రి చంద్ర బాబు తెలిపారు. అంతర్జాతీయ మాదకద్రవ్యాల దుర్వినియోగం, అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకుని గుంటూరులోని శ్రీ కన్వెన్షన్‌లో గురువారం జరిగిన అవగాహన సభలో సీఎం ప్రసంగించారు. గతంలో ఉమ్మడి, ఆ తర్వాత విభజన ఆంధ్రప్రదేశ్‌లో ఎన్నో సవాళ్లను ఎదుర్కొన్నానని, అయితే


మాదకద్రవ్యాలకు వ్యతిరేకంగా జరిగిన ర్యాలీలో పాల్గొన్న ప్రజానీకం



ఎన్‌సీసీ క్యాడెట్లు విద్యార్థులతో ర్యాలీలో పాల్గొన్న సీఎం చంద్రబాబు


జ్యోతి వెలిగించి సభను ప్రారంభిస్తున్న కేంద్ర మంత్రి పెమ్మసాని, హోం మంత్రి అనిత, చిత్రంలో సీఎం చంద్రబాబు, మంత్రి సంధ్యారాణి

ఈసారి యువతను నిర్వీర్యం చేస్తున్న డ్రగ్స్, గంజాయి అత్యంత ప్రమాదకరంగా తయారైందని ఆందోళన వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే గంజాయి, డ్రగ్స్‌పై ప్రత్యేక దృష్టి సారించి ఈగల్ విభాగాన్ని ఏర్పాటు చేశామన్నారు. గూగుల్, శాటిలైట్, డ్రోన్స్ వంటి సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించి గంజాయి సాగును పూర్తిగా తుడిచి వేశామన్నారు. గతంలో రౌడీయిజం, ముఠా కక్షలు, మత విద్వేషాలను పూర్తిగా అరికట్టామన్నారు. గత వైసీపీ పాలకులు గంజాయి సాగులో దేశంలోనే ఏపీని నెంబర్ వన్ స్థానంలో నిలపగా తాము అధికారంలోకి వచ్చిన వెంటనే గంజాయి, డ్రగ్స్ నివారణపై ప్రత్యేక దృష్టి సారించామన్నారు. టీడీపీ ప్రతిపక్షంలో ఉన్న సమయంలో అత్యంత ప్రమాదకరమైన డ్రగ్స్, గంజాయి కట్టడి చేయాలంటూ తాము పోరాడితే జగన్ ఒక్కరోజు కూడా స్పందించలేదన్నారు. గంజాయి పండించే వ్యక్తులు, అక్రమ రవాణా చేసేవారు, వాటికి బానిసలైన అందరిపైనా యుద్ధం ప్రకటిస్తున్నానన్నారు. అటువంటి వారు ఇకనైనా మారాలని, లేదంటే రాష్ట్రం వదిలి (మిగతా 8లో)

8
విద్యుత్ శాఖ.. సర్కిల్స్ పునర్విభజన
- గుంటూరు, సీఆర్‌డీఏ, బాపట్ల, పల్నాడు సర్కిల్స్‌లో సబ్ డివిజన్‌ల మార్పులు
- సీఆర్డీయే సర్కిల్‌లో కొత్తగా అమరావతి క్యాపిటల్ డివిజన్ ఏర్పాటు

6
రేవేంద్రపాడు విద్యార్థినికి మంత్రి లోకేశ్ ఆర్థిక సాయం
- అసెంబ్లీ ఎన్నికల్లో రికార్డు మెజార్టీకి సమానమైన రూ.91,413 అందజేత

పొగాకు ఉత్పత్తి లక్ష్యం కుదింపు
- 2025-26 పంట కాలానికి 142 మిలియన్ కేజీల పరిమాణం నిర్ధారణ
- గత ఏడాదితో పోల్చితే 25 మిలియన్ కేజీలను తగ్గించిన పొగాకు బోర్డు
- ధర పతనం కావడమే కారణమని బోర్డు సమావేశంలో నిర్ణయం

8
పోలీసు శాఖకు కృత్రిమ మేధ
- ఇన్నోవేటివ్ హ్యాకథాన్-2025కి గుంటూరు వేదిక
- హాజరుకానున్న సీఎం చంద్రబాబు, హోం మంత్రి, డీజీపీ

కార్యకర్తలను పట్టించుకోని జగన్

- రాక్షస మనస్థత్వం ఉన్న జగన్‌ను బహిష్కరించాలి
- పొన్నూరులో టీడీఆర్ బాండ్ల పంపిణీలో ఎమ్మెల్యే ధూళిపాళ్ల


రోడ్డు విస్తరణ భాధితులకు టీడీఆర్ బాండ్ల రూపంలో పరిహారం అందజేస్తున్న ఎమ్మెల్యే నరేంద్రకుమార్ తదితరులు

పొన్నూరుటౌన్, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): ప్రమాద సమయాల్లో సామాన్యులు సైతం స్పందిస్తుంటారని, కానీ మాజీ సీఎం జగన్ తన కారు కింద పడిన సొంత పార్టీ కార్యకర్తనే పట్టించుకోకుండా వెళ్లారని ఎమ్మెల్యే, సంగం డెయిరీ చైర్మన్ ధూళిపాళ్ల నరేంద్రకుమార్ తెలిపారు. అలాంటి జగన్ ఇక తమ గురించి ఎలా పట్టించుకుంటాడని ప్రజలు భావిస్తున్నారన్నారు. పొన్నూరులోని జీబీసీ రోడ్డు విస్తరణలో వైసీపీ హయాంలో గృహాలు కోల్పోయిన 50 మంది బాధితులకు పరిహారంగా గురువారం ఎమ్మెల్యే టీడీఆర్ బాండ్లను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అరాచక మనస్థత్వం ఉన్న జగన్ రెడ్డి లాంటి వ్యాక్తులను సమాజం నుంచి బహిష్కరించాల్సిన అవసరం ఉందన్నారు. అధికారంలో ఉన్న సమయంలో చేసిన విధ్వంసాన్ని ప్రతిపక్షంలో ఉండి కొనసాగిస్తున్నారని దుయ్యబట్టారు. విష ప్రచారం చేస్తే, అరాచకం సృష్టిస్తే ప్రజల తన వైపు ఉంటారనే భ్రమలో జగన్‌రెడ్డి ఉన్నాడని ఎద్దేవా చేశారు. కూటమి ప్రభుత్వం ఏర్పడక ముందే బెట్టింగ్‌ల్లో నష్టపోయి ఆత్మహత్య చేసుకున్న వైసీపీ నాయకుడి మరణాన్ని ప్రభుత్వ హత్యగా చిత్రీకరించడం సబబా అని ప్రశ్నించారు. విచక్షణ కోల్పోయిన జగన్ రెడ్డి తన తప్పులను కప్పిపుచ్చుకునేందుకు ఎదురు దాడికి పాల్పడుతున్నారని ఆరోపించారు. సంక్షేమం, అభివృద్ధి కూటమి ప్రభుత్వానికి రెండు కళ్లు అన్నారు. పట్టణంలో జీబీసీ రోడ్డు విస్తరణ పేరుతో గత పాలకులు చేసిన పాలన తీరు ప్రజలు ఎప్పటికీ మరిచిపోరన్నారు. పరామర్శించడానికి వెళ్లిన తమను చూసి బాధితులు నోరు విప్పాలంటే భయపడి కన్నీరు కార్చిన సంఘటనలు తమను తీవ్రంగా కలచి వేశాయని ఆనాటి సంఘటలను గుర్తు చేసుకున్నారు. తాము ఆదుకుంటామని ఇచ్చిన హామీని అమలు చేశామన్నారు. 162 భవనాలు కూల్చి వేయగా ఇప్పటివరకు 120 మందికి టీడీఆర్ బాండ్ల రూపంలో పరిహారం ఇచ్చామన్నారు. న్యాయపరమైన సమస్యలు పరిష్కరించుకుంటే మిగిలిన 42 మందికీ పరిహారం అందజేస్తామని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ముప్పాళ్ల రమేష్‌బాబు, జనసేన సమన్వయకర్త వడ్రాణం మార్కండేయబాబు, మాజీ వైస్ చైర్మన్ ఆకుల సాంబశివరావు, తదితరులు పాల్గొన్నారు.

8
ఒకటి నుంచి.. ఆర్‌బీఎస్‌కే పునః ప్రారంభం

పుట్టుకతో లోపాలున్న పిల్లలకు అంగన్‌వాడీ కేంద్రాల్లో స్క్రీనింగ్

గుంటూరు మెడికల్, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో జూలై ఒకటో తేదీ నుంచి రాష్ట్రీయ బాల స్వాస్థ్య కార్యక్రమం (ఆర్‌బీఎస్‌కే) పునః ప్రారంభిస్తున్నట్లు జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ విజయలక్ష్మి తెలిపారు. ఈ పథకం కింద పుట్టుకతో లోపాలు, వ్యాధులు, ఎదుగుదల లోపాలు గల పిల్లలకు అంగన్‌వాడీ కేంద్రాలు, పాఠశాలల్లో స్క్రీనింగ్ కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. దంత సమస్యలపై కూడా వైద్యులు స్క్రీనింగ్ పరీక్షలు జరుపుతారన్నారు. ఈ కార్యక్రమంలో లోపాలు గల పిల్లలను గుర్తించి వారిని తదుపరి వైద్య చికిత్సల కోసం గుంటూరు ప్రభుత్వ సమగ్రాస్పత్రిలోని జిల్లా సత్వర చికిత్సల కేంద్రానికి(డైక్) తరలిస్తారని తెలిపారు. ఈ కార్యక్రమాన్ని జిల్లాస్థాయిలో ఆర్‌బీఎస్‌కే జిల్లా కోఆర్డినేటర్ డాక్టర్ రోహిణి రత్నశ్రీ పర్యవేక్షిస్తారని డీఎంహెచ్‌వో తెలిపారు.

- ఊపందుకోనున్న భవన నిర్మాణాలు
- క్రిమినల్ కేసుల నుంచి ఎల్‌టీపీలకు మినహాయింపు
- సెట్ బ్యాక్ స్థలం తగ్గింపు.. నిర్మాణదారులకు ఊరట
- భవనాల ప్లాన్లు దాఖలు చేస్తున్న లైసెన్స్‌డ్ ఇంజనీర్లు



నిబంధనలు సడలింపు

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

పట్టణ భవన నిర్మాణాల్లో కొత్త నిబంధనలను ప్రభుత్వం సడలించింది. ట్రాఫిక్, డ్రెయినేజీ సమస్యలు తీర్చే దిశగా ప్రభుత్వం నిర్మాణాలకు కొత్త నిబంధనలు విధించిన విషయం తెలిసిందే. ఇవి నిర్మాణ రంగానికి గుదిబండగా మారడంతో ప్రభుత్వంపై వ్యతిరేకత వ్యక్తమైంది. ఈ నేపథ్యంలో నిబంధనలను సమీక్షించి కొన్నింటిని సవరిస్తూ ఉత్తర్వులు విడుదల చేసింది. ప్రధానంగా భవన నిర్మాణంలో వదలాల్సిన స్థలానికి (సెట్ బ్యాక్) మినహాయింపు ఇచ్చింది. భవన నిర్మాణంలో నిబంధనలు ఉల్లంఘిస్తే లైసెన్స్ టౌన్ ప్లానర్స్‌పై క్రిమినల్ కేసులు నమోదు చేసే విధానాన్ని విరమించుకుంది. కొత్త నిబంధనలతో భవన నిర్మాణాలకు ప్లాన్ దరఖాస్తులు కొన్ని నెలలుగా నిలిచిపోయాయి. నిబంధనలు సడలింపు చేయడంతో ప్లాన్‌ల కోసం దరఖాస్తులు చేసుకుంటున్నారు. దీంతో తిరిగి భవన నిర్మాణాలు ఊపందుకునే పరిస్థితులు నెలకొనున్నాయి.

నిలిచిన నిర్మాణాలు

కొత్త నిర్మాణాలకు ప్లాన్ ఆన్‌లైన్‌లో దాఖలు చేసేందుకు లైసెన్స్ టౌన్ ప్లానర్స్ (ఎల్‌టీపీ)కు పూర్తి అధికారాలను ప్రభుత్వం ఇచ్చింది. ప్లాన్‌ను అతిక్రమించి భవనం నిర్మిస్తే అందుకు ఎల్‌టీపీలను బాధ్యులను చేసింది. దీంతో యజమానులు ప్లాన్‌లు మంజూరు కాక కొత్త ఇళ్ల నిర్మాణాలు (మిగతా 8లో)

ఆడుదాం ఆంధ్రా.. అవినీతిమయం

- ఉమ్మడి గుంటూరు జిల్లాలో కోట్లలో అక్రమాలు
- ఇప్పటికే 28 మండలాల్లో విజిలెన్స్ విచారణ పూర్తి
- 10 రోజుల్లో విచారణ కొలిక్కి.. ప్రభుత్వానికి నివేదిక?
- భోజనాల్లో రూ.50 లక్షలు హాంఫట్.. క్రికెట్ కిట్లు మాయం


సచివాలయంలో రికార్డులు పరిశీలిస్తున్న విజిలెన్స్ అధికారులు

గుంటూరు సిటీ, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): గత వైసీపీ ప్రభుత్వ హయాంలో ఆడుదాం.. ఆంధ్రా అంటూ రూ.కోట్లు కొట్టేశారు. ఆటలకు ప్రాధాన్యం అంటూ ప్రభుత్వ సొమ్ములను బొక్కేశారు. ఆడుదాం ఆంధ్రాపై అప్పట్లోనే అనేక ఆరోపణలు రాగా కూటమి ప్రభుత్వం విజిలెన్స్ విచారణకు ఆదేశించింది. దీంతో ఆడుదాం ఆంధ్రాలో చోటుచేసుకున్న అవినీతి వ్యవహారాలు వెలుగుచూస్తున్నాయి. ఉమ్మడి గుంటూరు జిల్లా వేదికగా రూ.కోట్లలో అక్రమాలు జరిగినట్లు తేలింది. స్పోర్ట్స్ అథారిటీ ఆధ్వర్యంలో జరిగిన ఆడుదాం ఆంధ్రాలో నేతలు, అధికారులు అందిన కాడికి దండుకున్నారన్న ఆరోపణలు విజిలెన్స్ విచారణలో వెలుగుచూస్తున్నాయి. కాగా ఇప్పటికే 28 మండలాల్లో (మిగతా 8లో)


అప్పట్లో పంపిణీ చేసిన నాసిరకం క్రికెట్ బ్యాట్‌లను పరిశీలిస్తున్న విజిలెన్స్ అధికారులు

తెనాలి ఐటీఐలో జాబ్ మేళా రేపు

తెనాలి అర్బన్, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): తెనాలి ఐటీఐలో శనివారం జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపల్ రావి చిన వెంకటేశ్వర్లు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 11 ప్రముఖ కంపెనీల ప్రతినిధులు పాల్గొని ఇంటర్వ్యూలు నిర్వహిస్తారని పేర్కొన్నారు. ఎస్ఎస్‌సీ, ఇంటర్, ఐటీఐ, డిగ్రీ, బీటెక్, డిప్లొమా, ఫార్మసీ, పీజీ విద్యార్థులు సర్టిఫికెట్లతో హాజరు కావాలని తెలిపారు. వివరాలకు 78937 89361 నంబరుకు సంప్రదించాలని పేర్కొన్నారు.

మత్తులో ముంచేస్తున్నారు..!



మెథలీన్ డైయాక్సీ ఎన్ మెథాఫెటమైన్ (ఎండీఎంఏ).. విద్యా నిలయాల్లోకి చేరిందా? ఇంజనీరింగ్, ఇతర కళాశాలల్లో విద్యార్థులు ఈ డ్రగ్‌ను వాడుతున్నారా? తల్లిదండ్రులు ఇచ్చిన డబ్బును దీనికోసం వెచ్చిస్తున్నారా? అంటే అవుననే సమాధానమే వస్తుంది. ఢిల్లీ-విజయవాడ ఎండీఎంఏ డ్రగ్ కేసులో తవ్వేకొద్దీ కొత్త విషయాలు బయటకొస్తుండగా, తాజాగా కృష్ణా, గుంటూరు జిల్లాల్లోని ప్రముఖ కళాశాలల్లో చదువుతున్న విద్యార్థుల పేర్లు పోలీసుల చేతికి చిక్కాయి.

- విద్యార్థులే టార్గెట్‌గా నగరానికి డ్రగ్స్ సరఫరా
- ఎండీఎంఏ కేసులో బయటపడుతున్న నిజాలు
- ఇప్పటికే ముగ్గురు నిందితుల అరెస్టు
- ఢిల్లీ-విజయవాడ డ్రగ్స్ సరఫరా చేసింది వీరే..
- నిందితులతో తరచూ మాట్లాడుతున్న 50 మంది
- అంతా కృష్ణా, గుంటూరు జిల్లాల విద్యార్థులే..
- విద్యార్థులు, తల్లిదండ్రులకు పోలీసుల పిలుపులు

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : ఢిల్లీ నుంచి విజయవాడకు ఎండీఎంఏ డ్రగ్‌ను తీసుకొచ్చిన కేసులో ఉమ్మడి కృష్ణా, గుంటూరు జిల్లాలకు చెందిన 50 మంది విద్యార్థుల పేర్లు బయటకొస్తున్నాయి. ఈ కేసులో మొత్తం ఐదుగురిని టాస్క్‌ఫోర్స్, పటమట పోలీసులు అరెస్టు చేసిన విషయం తెలిసిందే. కాగా, నిందితుల సెల్‌ఫోన్లను విశ్లేషించగా, విద్యార్థుల జాతకాలు బయటపడ్డాయి. ఈ విద్యార్థులంతా వివిధ కళాశాలల్లో చదువుతున్నట్టు పోలీసులు గుర్తించారు. ఇప్పుడు వారందరినీ టాస్క్‌ఫోర్స్ కార్యాలయానికి పిలిపించాలని నిర్ణయించారు. విద్యార్థులతో పాటు వారి తల్లిదండ్రులనూ పిలిచి కౌన్సెలింగ్ ఇవ్వాలని భావిస్తున్నారు.

ఆ ముగ్గురే..

ఢిల్లీ నుంచి కొరియర్ ద్వారా హైదరాబాద్‌కు ఈ డ్రగ్‌ను రప్పించుకుని, అక్కడి నుంచి నగరానికి తీసుకొస్తున్న తిరుమలశెట్టి జీవన్ కుమార్, బొంతు నితీష్‌కుమార్, తూలిమెల్లి తరుణ్‌ప్రసాద్‌ను అరెస్టు చేసిన విషయం తెలిసిందే. వారికి ఢిల్లీలోని నోయిడాకు చెందిన రింకీ ఈ సరుకును పార్శిల్ చేస్తున్నాడని నిర్ధారణైంది. ఈ ముగ్గురు నిందితుల్లో జీవన్‌కుమార్ ఎండీఎంఏను రప్పించడంలో కీలకంగా వ్యవహరించాడు. పామర్రుకు చెందిన మనోహర్ అనే యువకుడు ఈ ఎండీఎంఏ రుచిని తనకు చూపించినట్టు జీవన్‌కుమార్ అంగీకరించాడు. దీంతో మనోహర్‌తో పాటు మరో నిందితుడిని కొద్దిరోజుల క్రితం పటమట పోలీసులు అరెస్టు చేశారు.

విద్యార్థులే టార్గెట్‌గా..

విద్యార్థులే టార్గెట్‌గా జీవన్‌కుమార్ ఎండీఎంఏ డ్రగ్‌ను విక్రయించినట్టు దర్యాప్తులో తేలింది. తొలివిడతలో అరెస్టైన ముగ్గురు నిందితుల్లో తరుణ్‌ప్రసాద్ పెనమలూరు మండలం గంగూరులో ఉన్న ఓ ప్రముఖ ఇంజనీరింగ్ కళాశాలలో చదువుతున్నాడు. ఈ ముగ్గురు నిందితుల సెల్‌ఫోన్లను పోలీసులు ఫోరెన్సిక్ ల్యాబ్‌లో విశ్లేషించారు. వారి సీడీఆర్ (కాల్ డేటా రికార్డు)ను పరిశీలించారు. ఈ ముగ్గురికి తరచూ 50 నెంబర్ల నుంచి ఫోన్లు రావడం, వెళ్లడం జరిగినట్టు గుర్తించారు. ఈ 50 నెంబర్లు ఎవరి పేర్ల మీద ఉన్నాయో పోలీసులు కూపీ లాగారు. వారంతా వివిధ కళాశాల్లో చదువుతున్నారని తేలింది. అందులో కొంతమంది ప్రముఖ ఇంజనీరింగ్ కళాశాలల్లో, మరికొంతమంది ప్రైవేట్ డిగ్రీ కళాశాల్లో చదువుతున్నట్టు గుర్తించారు. టాస్క్‌ఫోర్స్ పోలీసులు ఆ జాబితాను సిద్ధం చేశారు. దీన్ని పోలీసు ఉన్నతాధికారుల ముందు పెట్టినట్టు తెలిసింది. వారి తల్లిదండ్రులకు సమాచారం ఇవ్వాలని నిర్ణయించారు. విద్యార్థులను, వారి తల్లిదండ్రులను టాస్క్‌ఫోర్స్ కార్యాలయానికి పంపి కౌన్సెలింగ్ చేయాలని భావిస్తున్నారు. ఈ విద్యార్థులంతా ఏడాదిగా ఈ ముగ్గురు నిందితులతో సంభాషిస్తున్నట్టు సమాచారం. ఇలా ఎండీఎంఏను తీసుకున్న వారిలో గుంటూరు జిల్లాకు చెందిన విద్యాసంస్థల్లోని విద్యార్థులు కూడా ఉన్నారు. తల్లిదండ్రులు ఇచ్చే రూ.100, రూ.200తో ఈ ఎండీఎంఏ కొంటున్నట్టు పోలీసులు గుర్తించారు. కాగా, ఆ విద్యార్థులంతా ఏయే కళాశాలల్లో చదువుతున్నారో తెలుసుకుని వాటి యాజమాన్యాలకు పోలీసులు నోటీసులు జారీ చేసినట్టు తెలిసింది.

కన్సల్టెంట్ ఉద్యోగావకాశాలు

గుంటూరు సిటీ, జూన్ 26(ఆంధ్రజ్యోతి): గుంటూరు జిల్లా గ్రామీణ నీటి సరఫరా, పారిశుద్ధ్య విభాగంలో లిక్విడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ కన్సల్టెంట్ ఉద్యోగాలకు దరఖాస్తులు ఆహ్వా నిస్తున్నారు. తొమ్మిది నెలల కాలానికి గాను రూ.20 వేల జీతంతో ఈ ఉద్యోగాల నియామకం చేపడుతున్నట్లు అధికారులు తెలిపారు. డిగ్రీ కలిగిన అభ్యర్థులు ఈ ఉద్యోగానికి అర్హులని పేర్కొన్నారు. దరఖాస్తులు ఈ నెల 28వ తేదీ వరకు స్వీకరిస్తామని పేర్కొన్నారు. వివరాలకు 72078 60902కు సంప్రదించాలని తెలిపారు.

మైనర్‌తో అసభ్య ప్రవర్తన మూడేళ్ల జైలు

గుంటూరు లీగల్, జూన్ 26(ఆంధ్రజ్యోతి): మానసిక ఎదుగుదల లేని మైనర్ బాలిక పట్ల అసభ్యంగా ప్రవర్తించిన పెదవడ్లపూడి గ్రామంలోని చైతన్య నగర్‌కు చెందిన రామశేషు అనే నిందితుడికి మూడేళ్ల జైలు శిక్ష, రూ.10 వేల జరిమానా విధిస్తూ గుంటూరు పోక్సో కోర్టు న్యాయమూర్తి షమ్మీ పర్వీన్ సుల్తానా బేగం గురువారం తీర్పునిచ్చారు. 2019 సెప్టెంబర్ 8న ఉదయం 10.30 గంటలకు మానసికంగా ఎదుగుదల లేని మైనర్ బాలిక తన స్నేహితులతో ఆడుకుంటూ ఉంది. నిందితుడు రామ శేషు పొలం పనులకు వెళ్లి తిరిగి వస్తూ బాలికను దగ్గరకు పిలిచి కౌగిలించుకున్నాడు. బాలిక కేకలు వేయడంతో చుట్టు పక్కల వారు రాగా రామ శేషు అక్కడి నుంచి పరారయ్యాడు. ఆ బాలిక తల్లి ఫిర్యాదు మేరకు మంగళగిరి రూరల్ పోలీసులు రామ శేషుపై కేసు నమోదు చేశారు.

రేవేంద్రపాడు విద్యార్థినికి మంత్రి నారా లోకేశ్ ఆర్థిక సాయం

● అసెంబ్లీ ఎన్నికల్లో రికార్డు మెజార్టీకి సమానమైన రూ.91,413 అందజేత




ఉమామహేశ్వరికి నగదు అందజేస్తున్న లోకేశ్

దుగ్గిరాల, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): పదో తరగతి పరీక్షల్లో సత్తా చాటిన రేవేంద్రపాడు విద్యార్థిని గంపా ఉమామహేశ్వరికి రాష్ట్ర ఐటీ, మానవ వనరుల శాఖ మంత్రి నారా లోకేశ్ రూ.91,413 ఆర్థిక సాయం అందజేశారు. ఈ నగదు సంఖ్య అసెంబ్లీ ఎన్నికల్లో మంగళగిరి నియోజకవర్గంలో గతంలో ఎన్నడూ లేని విధంగా తొలిసారిగా లోకేశ్ సాధించిన రికార్డు మెజార్టీకి సమానం. ఎన్నికల ప్రచారంలో భాగంగా రేవేంద్రపాడు వచ్చిన నారా లోకేశ్ హైస్కూల్‌లో ప్రథమ ర్యాంకు సాధించిన విద్యార్థినికి నగదు బహుమతి అందిస్తానని ఇచ్చిన మాట నిలబెట్టుకున్నారని గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. రేవేంద్రపాడుకు చెందిన గంపా ఉమామహేశ్వరి 575 మార్కులతో మండల ప్రథమ ర్యాంకు సాధించింది. ఎంపీటీసీ కొప్పుల మధుబాబు, హెచ్ఎం బట్టి వెంకటకృష్ణారావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మతి స్థిమితం లేకపోవడంతోనే ఆత్మహత్యాయత్నం


● తోట గోపి తల్లిదండ్రులు



గోపి తల్లిదండ్రులు

తెనాలి రూరల్, జూన్26 (ఆంధ్రజ్యోతి): తాడేపల్లిలోని మాజీ సీఎం జగన్ ఇంటి ఎదుట బుధవారం మండలంలోని నందివెలుగు గ్రామానికి చెందిన తోట గోపి అనే వ్యక్తి పెట్రోలు పోసుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన విషయం విదితమే. అయితే అతనికి మతి స్థిమితం లేదని తల్లిదండ్రులు తోట శ్రీనివాసరావు, మల్లేశ్వరి తెలిపారు. ఈ ఘటన రాజకీయ కక్షతోనే జరిగిందన్న ఆరోపణలతో బాధితుడి తల్లిదండ్రులు స్పందించారు. తమ కుమారుడు ఎప్పుడూ ఇంటి పట్టునే ఉంటాడని మతి స్థిమితం కూడా సరిలేదన్నారు. పోలీసులు ఫోన్ చేసి గోపి ఆత్మహత్యాయత్నం చేశాడని తెలపడంతో షాక్‌కు గురయ్యామని చెప్పారు. పోలీసులు కౌన్సెలింగ్ ఇచ్చి పంపారన్నారు. తాము ఏ పార్టీకి చెందిన వారం కాదని స్పష్టం చేశారు. గోపీని వెన్ను భాగంలో నొప్పి కారణంగా చికిత్సకు తీసుకువెళ్తున్నట్లు వివరించారు. తమ బిడ్డను కాపాడిన పోలీసులకు కృతజ్ఞతలు తెలిపారు.

జాతీయస్థాయి పవర్ లిఫ్టింగ్‌లో సాదియాకు స్వర్ణం



సాదియా

మంగళగిరి సిటీ, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): కర్ణాటకలోని ధావన్ గిరిలో జరుగుతున్న జూనియర్ నేషనల్ ఎక్విప్డ్ ఉమెన్ పవర్ లిఫ్టింగ్ పోటీల్లో ఏపీ తరఫున ప్రాతినిధ్యం వహించిన గుంటూరు జిల్లా పవర్ లిఫ్టింగ్ క్రీడాకారిణి షేక్ సాదియా అల్‌మాస్ స్వర్ణ పతకం సాధించింది. సాదియా స్క్వాట్‌లో 200.5 కిలోల బరువును ఎత్తి స్వర్ణ పతకంతోపాటు జాతీయ స్థాయిలో సరికొత్త రికార్డు నెలకొల్పింది. బెంచి ప్రెస్‌లో 97.5 కిలోల బరువును ఎత్తి స్వర్ణం, డెడ్ లిఫ్ట్‌లో 185.5 కిలోల బరువును ఎత్తి స్వర్ణం.. ఓవరాల్‌గా 483.5 కిలోల బరువును ఎత్తి స్వర్ణ పతకాన్ని కైవసం చేసుకుంది. జూనియర్ నేషనల్ పవర్ లిఫ్టింగ్ పోటీల్లో రెండు జాతీయ రికార్డులు సాధించి నాలుగు బంగారు పతకాలతో సత్తా చాటిన సాదియా అల్‌మాస్‌ను పవర్ లిఫ్టింగ్ ఇండియా అధ్యక్షుడు సతీశ్, ప్రధాన కార్యదర్శి జోసెఫ్, జిల్లా పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు విజయభాస్కరరావు, సంధాని, వైస్ చైర్మన్ ఆర్ఎన్ వంశీకృష్ణ, సౌత్ ఇండియా ఆర్గనైజింగ్ సెక్రెటరీ కోటేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి సూర్యనారాయణ, అధ్యక్షుడు గంటా వెంకటేశ్వరరావు, గౌరవాధ్యక్షుడు ప్రభాకర్ అభినందించారు.

ప్రజా చైతన్యంతోనే మాదక ద్రవ్య రహిత సమాజం

గుంటూరు కార్పొరేషన్, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): ప్రజా చైతన్యంతో.. బలమైన రాజకీయ సంకల్పంతోనే మాదక ద్రవ్య రహిత సమాజాన్ని నిర్మించుకోగలమని జార్ఖండ్ మాజీ డీజీపీ మండవ విష్ణువర్ధనరావు పేర్కొన్నారు. గురువారం గుంటూరు జనచైతన్య వేదిక ఆధ్వర్యంలో అంతర్జాతీయ మాదక ద్రవ్యాల దుర్వినియోగం, అక్రమ మానవ రవాణా వ్యతిరేక దినోత్సవం సందర్భంగా చర్చాగోష్టి జరిగింది. జనచైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు వల్లంరెడ్డి లక్ష్మణరెడ్డి అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథి ఎంవీ రావు మాట్లాడుతూ..సంఘటితంగా డ్రగ్స్ వ్యాపారం చేస్తున్నారని, ఫిలిప్పీన్స్ లాంటి దేశాల్లో ప్రభుత్వాన్ని నడుపుతున్నారని పేర్కొన్నారు. ఒక వ్యక్తి మత్తుకు బానిసైతే ఆ కుటుంబం పతనమవుతుం దన్నారు. వల్లంరెడ్డి లక్ష్మణరెడ్డి మాట్లాడు తూ.. మాదక ద్రవ్యాల దుర్వినియోగంలో భారతదేశంలో తెలంగాణ మొదటి స్థానంలో ఉండగా, ఏపీ రెండో స్థానం లో ఉందని తెలిపారు. ప్రపంచంలో మత్తు పానీయాలకు 80 కోట్లు, ఇండియాలో 15 కోట్లు, ఏపీలో 80 లక్షల మంది అలవాటు కలిగి ఉన్నట్లు గణాంకాలు వెల్లడించారు. మాజీ మంత్రి డొక్కా మాణిక్య వరప్రసాద్ మాట్లాడుతూ.. సమాజం మొత్తం ఉద్యమిస్తేనే మాదక ద్రవ్యాల రహితం సాధ్యమవుతుందన్నారు. మాజీ ఎమ్మెల్సీ కె.ఎస్. లక్ష్మణరావు, సీపీఎం కార్యదర్శి నేతాజీ, మానవత చైర్మన్ రమేష్, కార్యదర్శి సతీష్, ధనుంజయ్ రెడ్డి, అడ్వకేట్ కృష్ణ, కోవిడ్ ఫైటర్స్ నేత ముజీబ్ ప్రసంగించారు.

గుంటూరు సిటీ వార్తలు

◆ గుంటూరు తూర్పు ◆ పశ్చిమ

కార్మిక శాఖ తనిఖీలు

గుంటూరు(తూర్పు), జూన్ 26 (ఆంధ్రజ్యోతి): స్థానిక పట్టాభిపురంలోని గ్రీన్ గ్రేస్ అపార్ట్‌మెంట్‌లో కార్మికశాఖ అధికారులు గురువారం తనిఖీలు చేపట్టారు. పని ప్రదేశంలో కల్పిస్తున్న సౌకర్యాలు, అందజేస్తున్న వేతనాల గురించి కార్మికులను అడిగి తెలుసుకున్నారు. మహిళా కార్మికులకు ప్రత్యేకంగా చేపట్టిన ఏర్పాట్లును, ప్రథమచికిత్స కిట్లును పరిశీలించారు. బాలకార్మికులను పనిలో పెట్టుకోవద్దని, ఎవరైనా ఇటువంటి చర్యలకు పాల్పడితే కేసులు నమోదు చేస్తామని ఉప కార్మిక కమీషనర్ గాయత్రి దేవి స్పష్టం చేశారు. తనిఖీలో అధికారులు కోటేశ్వర రావు, మాధురి, పద్మజ తదితరులు పాల్గొన్నారు.



కార్మికులతో మాట్లాడుతున్న కార్మిక శాఖ అధికారులు

దళిత జాతిలో తప్ప పుట్టిన జూపూడి

● బత్తుల భాస్కర్

గుంటూరు, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): దళిత జాతిలో జూపూడి ప్రభాకర్ తప్పబుట్టాడని టీడీపీ ఎస్సీ సెల్ జిల్లా కార్యాదర్శి బత్తుల భాస్కర్ ఓ ప్రకటనలో విమర్శించారు. రాష్ట్రంలో వైసీపీ అరాచకం పరాకాష్టకు చేరిందన్నారు. జగన్‌రెడ్డి కారు కింద బలైపోయిన దళితుడైన సింగయ్య చావే అందుకు నిదర్శనమన్నారు. సింగయ్య చనిపోయిన విధానం సమాజంలో దళితులతో పాటు రాష్ట్ర ప్రజలందరూ చూసి జగన్‌రెడ్డి మానవత్వం లేని దుర్మార్గుడు అంటుంటే, ఆయన గొప్ప మానవతావాది అని కితాబియ్యడం జూపూడి బానిస మనస్తత్వానికి నిదర్శనమన్నారు. ఎర్రగడ్డ మెంటల్ హాస్పిటల్‌లో చూపించుకోవాలని జూపూడికి సలహా ఇచ్చారు. రాజకీయ, వ్యక్తిగత లాభాలు, పదవుల కోసం దళితుల మనోభావాలు దిగజార్చే జూపూడి ప్రభాకర్ లాంటి ద్రోహులను ఎస్సీ సమాజం వెలివేయాలని పిలుపునిచ్చారు. కుటుంబానికి ఆధారమైన దళితుడైన సింగయ్య మరణానికి సంఘీభావం తెలపకపోగా ఫేక్ వీడియోగా చిత్రీకరించాలని చూడటం సిగ్గుమాలిన చర్య అన్నారు. సింగయ్య మరణానికి కారణమైన ప్రతి ఒక్కరికి కఠినంగా శిక్ష పడాలని కోరారు.

నగరంలో జోరు వాన

● లోతట్టు ప్రాంతాలు జలమయం



బ్రాడీపేట 2/7వ లైనులో తటాకాలను తలపిస్తున్న వర్షపునీరు



అరండల్‌పేట 9వ లైనులో ఇలా..

గుంటూరు, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): అల్పపీడన ద్రోణి కారణంగా నగరంలో గురువారం సాయంత్రం జోరు వర్షం కురిసింది. ఉదయం నుంచే ఆకాశం మేఘావృతమై మబ్బులు కమ్మినప్పటికీ వేడి వాతావరణం కనపించింది. మధ్యాహ్నం దాటిన తరువాత ఆకాశంలో మేఘాలు కమ్మి సాయంత్రానికి వాతావరణం మారిపోయింది. నాలుగు గంటల సమయంలో ఒక్క సారిగా వర్షం పడటంతో ప్రజలు పరుగులు పెట్టాల్సి వచ్చింది. జోరు వానతో నగరంలోని లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. కంకరగుంట ఆర్‌యూబీ, మూడు వంతెనల వద్ద వర్షపునీరు తటాకాలను తలపించింది. పాతగుంటూరు, నల్లపాడు రోడ్డు, అమరావతి రోడ్డులోని పలు లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి.



బ్రాడీపేట 2/7వ లైనులో...



ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు గురువారం గుంటూరు పర్యటన సందర్భంగా పుష్పాలతో స్వాగతం పలుకుతున్న జడ్పీచైర్‌పర్సన్ హెనీక్రిస్టినా, తూర్పు ఎమ్మెల్యే మహమ్మద్ నసీర్, పశ్చిమ ఎమ్మెల్యే గళ్లా మాధవి, దేగల ప్రభాకర్



ట్యాబులు అందుకున్న ఆర్పీలతో ఎమ్మెల్యే నసీర్ అహ్మద్

డ్వాక్రా సంఘాలతో మహిళల ఆర్థికాభివృద్ధి

● ఆర్పీలకు ట్యాబ్‌లకు పంపిణీలో తూర్పు ఎమ్మెల్యే నసీర్

గుంటూరు కార్పొరేషన్, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): డ్వాక్రా సంఘాల ఏర్పాటుతో మహిళల ఆర్థికాభివృద్ధి సాధ్యమవుతుందని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే నసీర్ అన్నారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో గురువారం 150 మంది మెప్మా రిసోర్స్ పర్సన్లకు ఎమ్మెల్యే ట్యాబ్‌లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డ్వాక్రా సంఘాల ఏర్పాటుకు సీఎం చంద్రబాబు శ్రీకారం చుట్టారని, అది నేడు రాష్ట్రంలో లక్షల మంది జీవితాల్లో వెలుగులు నింపుతోందని తెలిపారు. డ్వాక్రా సంఘాల ద్వారా అతి తక్కువ వడ్డీతో రుణాలు అందిస్తారని, వీటిని మహిళలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ సజీల, కార్పొరేటర్ సమత, భారతి, సంకూరి శ్రీనివాస రావు, పీడీ విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

రాయపాటిని కలిసిన నారాయణ



రాయపాటి సాంబశివరావుకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న కే నారాయణ

గుంటూరు(తూర్పు), జూన్ 26(ఆంధ్రజ్యోతి): మాజీ ఎంపీ రాయపాటి సాంబశివరావును సీపీఐ జాతీయ కార్యదర్శి కే నారాయణ మర్యాదపూర్వకంగా కలిశారు. గుంటూరుకు వచ్చిన ఆయన రాయపాటి నివాసంలో కలిసి ఆరోగ్య పరిస్థితిని, యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. ప్రస్తుత దేశ, రాష్ట్ర రాజకీయాలపై వారు సుదీర్ఘంగా చర్చించుకున్నారు. రానున్న రోజుల్లో రాయపాటి సాంబశివరావు క్రియాశీల రాజకీయాల్లో చురుగ్గా పాల్గొనాలని ఆయన ఆకాంక్షించారు. కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ళ నాగేశ్వరరావు, జంగాల ఆజయ్ కుమార్, కోట మాల్యాద్రి, షేక్ వలి, జంగాల చైతన్య, రావుల అంజిబాబు, రమణ తదితరులు పాల్గొన్నారు.

ఆసక్తికరంగా ఫెన్సింగ్ పోటీలు

గుంటూరు(తూర్పు), జూన్ 26(ఆంధ్రజ్యోతి): గుంటూరు ఫెన్సింగ్ స్పోర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అండర్-10, 12 బాలుర, బాలికల విభాగాల్లో ఏసీఎమ్‌ఈ పాఠశాల మైదానంలో జరిగిన జిల్లా స్థాయి ఫెన్సింగ్ పోటీలు ఆసక్తికరంగా సాగాయి. తొలుత పోటీలను పాఠశాల డైరక్టర్ నందమూరి సౌగంధకృష్ణ ప్రారంభించారు. ఈ సందర్భంగా అసోసియేషన్ ఛైర్మన్ క్రిష్టఫర్, ప్రధాన కార్యదర్శి అశోక్‌బాబు మాట్లాడుతూ ఎంపికైన క్రీడాకారులు ఈ నెల 29న విజయవాడ లోని ఇందిరా గాంధీ మున్సిపల్ మైదానంలో జరిగే పోటీల్లో పాల్గొంటారన్నారు.



పోటీలను ప్రారంభిస్తున్న సౌంగధకృష్ణ

విజేతల వివరాలు: అండర్-12, ఇప్పి విభాగంలో: జోష్నిక, లక్ష్మీకార్తీక, శ్వేత, ఫాయిల్ విభాగంలో: శ్లోక, హస్నా, శ్రీలక్ష్మి, కౌశిక్, సబర్ విభాగంలో: ఆరోహి, హన్సిక, చైతన్య సాయి, పృధ్వీ, వెంకటేష్, అండర్ 10, ఇప్పి విభాగంలో: దీక్షిత, తన్మైశ్రీ, స్నేహశ్రీ, హర్షవర్ధన్, ఫాయిల్ విభాగంలో: రిశాంక్, సంజయ్, రిత్విక్.

స్టార్టప్ మహాకుంభ్‌లో మంగళగిరి విద్యార్థి ప్రతిభ

● మహిళల కోసం స్మార్ట్ శానిటరీ ప్యాడ్ రూపకల్పన

● విద్యార్థి వంశీని అభినందించిన మంత్రి లోకేశ్

మంగళగిరి, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): ఢిల్లీలో ఈ ఏడాది ఏప్రిల్‌లో జరిగిన స్టార్టప్ మహాకుంభ్ ఈవెంట్‌లో మంగళగిరికి చెందిన విద్యార్థి వనమా వంశీ మహిళల ఆరోగ్యం కోసం మాగ్నా ప్యాడ్స్ పేరుతో స్మార్ట్ శానిటరీ ప్యాడ్‌ను రూపొందించి ప్రదర్శించారు. జాతీయ స్థాయిలో జరిగే స్టార్టప్ మహాకుంబ్ ఈవెంట్‌లో దాదాపు వెయ్యి కళాశాలలకు చెందిన విద్యార్థులు తమ ఆవిష్కరణలను ప్రదర్శించారు. వడ్లమూడి విజ్ఞాన్ కళాశాలలో బీఫార్మసీ ద్వితీయ సంవత్సరం చదువుతున్న వంశీ తన గైడ్ డాక్టర్ పీ.శ్రీనివాస్‌బాబు సహకారంతో స్టార్టప్ మహాకుంబ్ ఈవెంట్‌కు హాజరై మహిళల ఆరోగ్యం కోసం తాను రూపొందించిన స్మార్ట్ శానిటరీ ప్యాడ్‌ను ఆవిష్కరించారు. తన వినూత్న ఆవిష్కరణతో రూ.8 లక్షల నగదు బహుమతిని గెలుచుకుని సౌత్ ఇండియాలోనే ప్రథమ స్థానంలో నిలిచారు. వంశీ ఆవిష్కరణను ఇండియన్ జనరల్ ఆఫ్ పేటెంట్స్‌లో కూడా పబ్లిష్ చేశారు. కాగా, విద్యార్థి వనమా వంశీని రాష్ట్ర ఐటీ, విద్యా శాఖల మంత్రి నారా లోకేశ్ గురువారం అభినందించారు. ఈ మేరకు ఉండవల్లి నివాసంలో వంశీ కుటుంబ సభ్యులను కలిశారు. వంశీ స్టార్టప్ మహాకుంభ్‌లో ప్రతిభ కనబర్చి రాష్ట్రానికి గర్వకారణంగా నిలిచారని మంత్రి లోకేశ్ ప్రశంసించారు. భవిష్యత్తులో అండగా ఉంటామని, అమరావతిలో ఏర్పాటు చేయబోయే రతన్ టాటా ఇన్నోవేషన్ ద్వారా ప్రోత్సాహం అందిస్తామని హామీ ఇచ్చారు.



వంశీని అభినందిస్తున్న మంత్రి లోకేశ్

శ్రీవారిని దర్శించుకున్న హంపీ పీఠాధిపతులు



ఆలయ పాలక కమిటీ సభ్యులకు ప్రసాదాలు అందజేస్తున్న విద్యారణ్య భారతి మహాస్వామి

గుంటూరు(తూర్పు), జూన్ 26(ఆంధ్రజ్యోతి): స్థానిక బృందావన్ గార్డెన్స్ శ్రీవేంకటేశ్వరస్వామివారి దేవాలయంలో హంపి పీఠాధిపతులు విద్యారణ్య భారతిమహాస్వామి శ్రీవారిని సందర్శించారు. కార్యక్రమంలో బొల్లేపల్లి సత్యనారాయణ, ఆలయకమిటీ అధ్యక్షుడు సీహెచ్.మస్తానయ్య, కార్యదర్శి బొర్రా ఉమామహేశ్వరరావు, సహాయ కార్యదర్శులు ఊటుకూరి నాగేశ్వరరావు, పుట్టా ప్రభాకరరావు, ఆలయ అర్చకస్వాములు, భక్తులు స్వామివారి ఆశీస్సులను అందుకున్నారు.

మాదక ద్రవ్యాలకు వ్యతిరేకంగా ర్యాలీ



ర్యాలీలో న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి సయ్యద్ జియావుద్దీన్

గుంటూరు, జూన్ 26(ఆంధ్రజ్యోతి): మాదక ద్రవ్యాల దుర్వినియోగం, అక్రమ రవాణా దినోత్సవం సందర్భంగా జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో గురువారం ర్యాలీ నిర్వహించారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి సయ్యద్ జీయావుద్దీన్ పలువురు న్యాయవాదులు, ఎక్సైజ్ పోలీసులతో కలిసి ర్యాలీ చేశారు.

సహకార సంఘాలకు బకాయిలు చెల్లించాలి

● లోకేశ్‌కు చేనేత కార్మిక సంఘం నేతల వినతి

మంగళగిరి సిటీ, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): చేనేత సహకార సంఘాలకు ప్రభుత్వం చెల్లించవలసిన రూ.156 కోట్ల బకాయిలు వెంటనే చెల్లించాలని ఏపీ చేనేత కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ నేతలు కోరారు. ఈ మేరకు గురువారం రాష్ట్ర ఐటీ, విద్యా శాఖల మంత్రి నారా లోకేశ్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. రాష్ట్రంలో వ్యవసాయం తర్వా త ప్రధాన వృత్తిగా ఉన్న చేనేత కార్పొరేట్ విధానాల వల్ల సంక్షోభం లో చిక్కుకుపోయిందని, ఫలితంగా నేత కార్మికులు ఆకలిచావులు, ఆత్మ హత్యలకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశా రు. బీజేపీ ప్రభుత్వం చేనేతపై జీఎస్టీ విధించ డంతో పరిశ్రమ మరింత సంక్షోభంలోకి నెట్టబడిం దన్నారు. గత ప్రభుత్వం నేతన్న నేస్తం పథకం చేనేత షెడ్డు కార్మికులకు అమలు చేయలేదన్నా రు. 2024-25 బడ్జెట్‌లో చేనేతకు నామమాత్రం గా కేటాయింపులు జరిగాయన్నారు. యార్న్ సబ్సిడీ, పావలా వడ్డీ కింద రూ.156 కోట్లు వెంటనే చెల్లించాలని, త్రిఫ్ట్ ఫండ్ రూ.5 కోట్లు విడుదల చేయాలని విజ్ఞప్తి చేశారు. రాష్ట్రంలో నేత నేస్తున్న ప్రతి కార్మికుడికి, మగ్గాల షెడ్డులో నేస్తున్న వారికి, అనుబంధ వృత్తుల వారికి, సహకార సంఘాల్లో నేత నేస్తున్న వారికి ఇంటికి 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్తు పథకం అమలు చేయాలని విన్న వించారు. ఆయా సమస్యలపై లోకేశ్ సానుకూ లంగా స్పందించినట్టు చేనేత కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పిల్లలమర్రి బాలకృష్ణ తెలిపారు. కార్యక్రమంలో ఏపీ చేనేత కార్మికసంఘం అధ్య క్షుడు కట్టా శివదుర్గారావు, నేతలు డోకుపర్తి రామారావు, అనుమల వీరబ్రహ్మం, కౌతరపు వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.



మంత్రి లోకేశ్‌కు వినతిపత్రం అందజేస్తున్న చేనేత కార్మిక సంఘం నేతలు

సైకిల్ యాత్రికుడికి ఘన స్వాగతం



సైకిలిస్టు కార్తీక్‌కు నగరంలో జెండా ఊపుతున్న బ్రాహ్మణ చైతన్య వేదిక నాయకులు

గుంటూరు, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): పచ్చని భూమిని కాపాడుకుంటూ చెట్లని చిన్ననాటి నుంచే నాటుతూ వాతావరణంలో కాలుష్యాన్ని నిర్మూలించాలని కడప జిల్లాకు చెందిన కోటా కార్తీక్ అనే డిగ్రీ విద్యార్థి సైకిల్‌పై భారతదేశ యాత్రలో భాగంగా గుంటూరు నగరానికి చేరుకొన్నారు. తన యాత్రలో భాగంగా దారిలో చెట్లు నాటుతూ కాలుష్య రహిత భారతదేశ నిర్మాణం జరగాలని ఆయన కాంక్షిస్తూ ముందుకు సాగుతున్నారు. గురువారం గుంటూరు వచ్చిన సందర్భంలో తెలుగుదేశం పార్టీ సీనియర్ నేత, బ్రాహ్మణ చైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు సిరిపురపు శ్రీధర్, బ్రాహ్మణ చైతన్య వేదిక, చాణిక్య ఫ్రెండ్ సర్కిల్ సభ్యులు సంఘీభావం తెలియజేశారు. కార్తీక్‌కు భోజన, వసతి సౌకర్యాలు ఏర్పాటు చేసి ఆయన్ను గుంటూరు నుంచి జెండా ఊపి సాగనంపారు. కార్యక్రమంలో చిలుమూరు ఫణి, ఎండపల్లి శబరి, ఫణి, నాగరాజు, వడ్లమూడి రాజా, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

కూటమి పాలనతో సంక్షేమ విప్లవం

గుంటూరు మెడికల్, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర చరిత్రలో ఎన్నడూ లేనివిధంగా కూటమి పాలనలో సంక్షేమ రంగంలో విప్లవాత్మక మార్పులు వచ్చినట్లు జనసేన పార్టీ జిల్లా అధికార ప్రతినిధి ఆళ్ల హరి తెలిపారు. గురువారం శ్రీనివాసరావుతోటలో వృద్ధులకు, విభిన్న ప్రతిభావంతులకు రేషన్ సరుకులను ఇంటింటికి తీసుకెళ్లి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా హరి మాట్లాడుతూ ఎన్నికల్లో ఇచ్చిన హామీలే కాకుండా ప్రజలకు చెప్పని సంక్షేమాన్ని సైతం అందిస్తున్న ఘనత కూటమి ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. కార్యక్రమంలో వడ్డే సుబ్బారావు, కలపాల శ్రీలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

బాబుతోనే గంజాయి రహిత ఏపీ

గుంటూరు, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబుతోనే గంజాయి రహిత ఏపీ సాధ్యమని బీజేపీ నేత, ప్రత్తిపాడు నియోజకవర్గ కోకన్వీనర్ దర్శనపు శ్రీనివాసరావు అన్నారు. ఈ మే రకు గురువారం నగరానికి వచ్చిన సీఎం చంద్రబాబును ఆయన ఘనంగా సత్కరించారు. అంతర్జాతీయ మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం సందర్భంగా గుంటూరు రూరల్ మండలం నగరాల్లో భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగన్ ఐదేళ్లలో రాష్ట్రాన్ని గంజాయి వనంగా మార్చారన్నారు. జగన్ కారణంగా దేశవ్యాప్తంగా లక్షలాది కుటుంబాల్లో అశాంతి నెలకొందన్నారు. ఏపీని, రాష్ట్రంలోని యువతను సర్వనాశనం చేశారన్నారు. చంద్రబాబు విజన్ రాష్ట్రానికి ఎంతో అవసరమన్నారు.

ఘనంగా కళాసేవా పురస్కారం ప్రదానం

గుంటూరు(తూర్పు), జూన్ 26(ఆంధ్రజ్యోతి): స్థానిక బృందావన్‌గార్డెన్స్, శ్రీఅన్నమయ్య కళావేదికపై గురువారం బీవీ రావు మెమోరియల్ థియేటర్స్ వారి ఆధ్వర్యంలో కళా సేవా పురస్కార సభ ఘనంగా జరిగింది. సభాధ్యక్షుడుగా నటుడు, దర్శకుడు ఎంవీ ఎల్ నరసింహారావు వ్యవహరించగా ప్రముఖ వ్యాఖ్యాత ఏవీకే సుజాత సభా పరిచయం చేశారు. ముఖ్య అతిధిగా డాక్టర్ ఆరె, అతిధులుగా ఆలయ కమిటీ సహాయ కార్యదర్శి ఊటుకూరి నాగేశ్వరరావు, జైభవాని నాట్యమండలి అధ్యక్షుడు ఐతి వాసుదేవశర్మ, బి.శ్రీనివాస్, పురస్కార ప్రదాత వీఎస్ రోహిత్ పాల్గొని నటుడు, గుణ నిర్దేత పరిషత్ నిర్వాహకులు మానాపురం సత్యనారాయణను కళాసేవా పురస్కారంతో ఘనంగా సత్కరించారు. సభానంతరం నంది అవార్డు గ్రహీత కాపూరి సత్యనారాయణ పర్యవేక్షణలో కె.ఆదిత్య రచించి, కేవీ మంగారావు దర్శకత్వం వహించిన మిణుగురు - వెలుగులు నాటిక ఆకట్టుకుంది.



సత్యనారాయణను సత్కరిస్తున్న నిర్వాహకులు

మహిళలపై పెట్టిన కేసులు ఎత్తి వేయాలి

తుళ్లూరు(మందడం), జూన్ 26(ఆంధ్రజ్యోతి):మందడం దళితకాలనీలో తాగునీరు రావటం లేదని ఆందోళన వ్యక్తం చేసిన దళిత మహిళలపై పెట్టిన కేసులు ఎత్తివేయాలని గురువారం మందడంలోని తుళ్లూరు డీఎస్పీ కార్యాలయంలో ప్రజాసంఘాల నేతలు సీసీకి అర్జీ అందజేశారు. రాజధానిలో మంచినీళ్లు రావటం లేదని అడిగినందుకు తుళ్లూరు పోలీసులు కేసు పెట్టటం ఏమిటని ఎం రవి, ఎం భాగ్యరాజు ధ్వజమెత్తారు. రాజధాని గ్రామంలో మంచినీటి సౌకర్యం లేక ఇబ్బందులు పడుతుంటే పంచాయతీ, సీఆర్డీఏ అధికారులు ఒకరిమీద ఒకరు చెప్పుకుంటూ కాలం వెళ్లబుచ్చుతున్నారన్నారు. మురుగు నీరు వస్తుందని పలుమార్లు అర్జీలు ఇచ్చినా అధికారులు నిమ్మకు నీరెత్తినట్టుగా ఉండటంతో దళిత మహిళలు రోడ్డెక్కటం తప్పా.. అని ప్రశ్నించారు. ప్రజలకు వెంటనే మంచినీరు అందించేలా చర్యలు చేపట్టాలని కోరారు. అర్జీ అందజేసినవారిలో ఆర్డీఐ జాతీయ అధ్యక్షుడు పీ చంద్రమోహన్, కోలేటి అనిల్, బేతపూడి రమేష్, కుంభ అంజనేయు లు, కట్టెపోగు సునీత, గడ్డం హృదయమ్మ, ప్రసాద్, యశోద, తదితరులున్నారు.

వైభవంగా సత్యసాయి ప్రేమ వాహిని రథయాత్ర

గుంటూరు (తూర్పు), జూన్ 26(ఆంధ్రజ్యోతి): శ్రీ సత్యసాయి బాబా వారి 100వ జన్మదినోత్సవం సందర్భంగా నగరంలో నిర్వహించిన ప్రేమ వాహిని రథయాత్ర వైభవంగా జరిగింది. యాత్ర సత్యసాయి ఆధ్యాత్మిక కేంద్రం బొమ్మిడాల నగర్ నుంచి ప్రారంభమైన శ్రీకన్యకా పరమేశ్వరీ ఆలయం మీదుగా రామానామక్షేత్రం, జడ్పీ ప్రాంగణం మీదుగా ఏటీ అగ్ర హా రం 4వ లైన్, రావి రెసిడెన్సీ పైగా సాగింది. ఈ సందర్భంగా ఏటీ అగ్రహారం వాసులు రథానికి అపూర్వ స్వాగ తం పలికి హనుమాన్ చాలీసా, భజన కార్యక్రమం నిర్వహించారు. రథానికి వారు పోసి హారతులు ఇచ్చారు. కార్యక్రమాల్ని శ్రీసత్యసాయి భజనమండలి కన్వీనర్ డాక్టర్ పీఎల్ నరసింహారావు పర్యవేక్షించారు.



శ్రీ సత్యసాయి బాబా చిత్రపటానికి హారతి ఇస్తున్న చిన్నారి

విజ్ఞాన్స్‌లో ముగిసిన ఎన్‌సీసీ శిక్షణ



విద్యార్థులకు అవార్డులు అందజేస్తున్న ఎన్‌సీసీ అధికారులు

గుంటూరు (విద్య) జూన్ 26 (ఆంధ్రజ్యోతి): చేబ్రోలు మండలం వడ్లమూడి విజ్ఞాన్స్ యూనివర్సిటీలో ఎన్‌సీసీ వార్షిక శిక్షణ శిబిరం గురువారం ముగిసింది. కార్యక్రమానికి హాజరైన కమాండింగ్ ఆఫీసర్ కల్నల్ సీఎస్ సిద్ధూ మాట్లాడుతూ కేడెట్లను బాధ్యతాయుత పౌరులుగా తీర్చిదిద్దే లక్ష్యంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించామన్నారు. నాయకత్వ లక్షణాలు, శాస్త్రీయ క్రమశిక్షణ, సాంస్కృతిక అవగాహన కూడా పెంపొందించామన్నారు. శిబిరంలో గుంటూరు గ్రూప్‌కు చెందిన 15 కాలేజీలు, 30 పాఠశాలల నుంచి 640 మంది కేడెట్లు, 50 మంది సివిల్ ఆర్మీ సిబ్బంది పాల్గొన్నారన్నారు. శిబరంలో అబ్‌స్టాకిల్ ట్రైనింగ్, మ్యాప్ పఠనం, ఆయుధ శిక్షణ, కాల్పుల అనుభవం, శారీరక వ్యాయామాలు, డ్రిల్‌పై శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో యూనివర్సిటీ ఛైర్మన్ డాక్టర్ లావు రత్తయ్య, వైస్ చాన్స్‌లర్ కల్నల్ ప్రొఫెసర్ పీ.నాగభూషణ్, రిజిస్ట్రార్ డాక్టర్ పీఎంవీ రావు, ఆయా విభాగాల డీన్లు పాల్గొన్నారు.

పోలీసు శాఖకు కృత్రిమ మేధ

- ఇన్నోవేటివ్ హ్యాకథాన్-2025కి గుంటూరు వేదిక
- 27, 28, 29 తేదీల్లో చౌడవరం ఆర్‌వీఆర్ కళాశాలలో నిర్వహణ
- తొలి రోజున హాజరుకానున్న సీఎం చంద్రబాబు, హోం మంత్రి, డీజీపీ

గుంటూరు, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): కృత్రిమ మేధ(ఆర్టీఫిషియల్ ఇంటెలిజెన్స్)ని అందిపుచ్చుకొనేందుకు ఆంధ్రప్రదేశ్ పోలీసు శాఖ సిద్ధమైంది. కేసుల దర్యాప్తులో సాంకేతికంగా ఎదురౌతున్న సవాళ్లను అధిగమించేందుకు ఏఐని వినియోగించుకోవాలని నిర్ణయించింది. ఇందుకోసం జాతీయ స్థాయి హ్యాకథాన్‌ని ఈ నెల 27, 28, 29 తేదీల్లో నిర్వహించనుంది. గుంటూరు పశ్చిమ మండలంలోని చౌడవరంలో ఉన్న ఆర్‌వీఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో హ్యాకథాన్ నిర్వహణకు పోలీసు శాఖ ఏర్పాట్లు పూర్తి చేసింది. తొలి రోజున జరిగే కార్యక్రమంలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, హోం మంత్రి వంగలపూడి అనిత, డీజీపీ హరీష్‌కుమార్ గుప్తా, కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్, పోలీసు ఉన్నతాధికారులు, ఆర్టీఫిషియల్ ఇంటెలిజెన్స్ నిపుణులు హాజరు కానున్నారు. శని, ఆదివారంలలో టెక్నికల్ సెషన్స్ జరుగుతాయని పోలీసు అధికారవర్గాలు తెలిపాయి.

ఏఐ ఫర్ ఆంధ్రపోలీసు ఇన్నోవేషన్ హ్యాకథాన్ - 2025 పేరుతో నిర్వహించబోతున్న ఈ కార్యక్రమానికి పోలీసు శాఖ ప్రత్యేక వెబ్‌సైట్‌ని రూపొందించింది. గత కొన్ని రోజులుగా ఈ హ్యాకథాన్‌లో పాల్గొనేందుకు రిజిస్ట్రేషన్స్ నిర్వహిస్తోన్నది. అలానే వలంటీర్లుగా పని చేసేందుకు కూడా రిజిస్ట్రేషన్ చేసుకొనేందుకు వెబ్‌సైట్ ద్వారా అవకాశం కల్పించింది. ఆపరేషన్స్ అండ్ టెక్నికల్ సర్వీసెస్ ఐజీపీ డాక్టర్ సీహెచ్ శ్రీకాంత్, ఫోర్ సైట్ ఏఐ సీఈవో సూర్య కొత్త కీలకోపన్యాసం చేస్తారు. నేటి సమాజంలో పోలీసు శాఖ ఎనిమిది అత్యధిక ప్రభావిత వినియోగ కేసులను గుర్తించింది. తరచుగా నమోదు అవుతున్న ఈ కేసులను పరిష్కరించేందుకు కృత్రిమ మేధ ద్వారానే సాధ్యమని అభిప్రాయపడుతున్నది. ఈ నేపథ్యంలో దేశ వ్యాప్తంగా నిపుణులను ఈ హ్యాకథాన్‌కి ఆహ్వానించింది. మూడు రోజుల పాటు జరిగే టెక్నికల్ సెషన్స్‌లో సమస్యలు, సవాళ్లపై చర్చించి పరిష్కారాలను కనుగొనాలనేది ప్రధాన లక్ష్యం. పబ్లిక్ సర్వీసు, లా ఎన్‌ఫోర్స్‌మెంట్‌లో సమస్యలకు పరిష్కారం కనుగొనడానికి ఇదొక గొప్ప వేదిక అవుతుందని పేర్కొంటున్నది.



ఆర్‌వీఆర్ కళాశాలలో పోలీసు శాఖకు కృతిమ మేధ హ్యాకథాన్ నిర్వహణకు చేసిన ఏర్పాట్లు

ఎనిమిది కేసులు ఇలా..

పీఎస్/ఎస్పీ/సీవో స్థాయిలో స్వీకరించిన పిటీషన్లను విశ్లేషించి, వాటి పరిష్కారానికి కార్యచరణ ప్రణాళిక రూపొందించేందుకు ఏఐ సహకారం తీసుకోవాలని నిర్ణయించారు. దీనికి విజయనగరం ఎస్పీ వకుల్ జిందాల్ మెంటార్‌గా వ్యవహరిస్తారు. రెండో కేసుగా ఏఐ పవర్డ్ సీసీటీఎన్ఎస్ డేటా నుంచి స్వర ఆధారిత సహజ భాషలో ప్రశ్నించడం, రిపోర్టు జనరేట్ చేయడం. దీనికి మెంటార్‌గా ఐపీఎస్ అధికారి సిద్ధార్థ కౌశల్ వ్యవహరిస్తారు. మూడో కేసుగా ఏఐ పవర్డ్ సోషల్ మీడియాలో స్పాన్సర్డ్ స్కామ్ యాడ్స్‌ని గుర్తించడం, రిపోర్టు చేయడం. దీనికి హ్యాష్‌ట్యాగ్ ఇంటెలిజెన్స్, లా ఎన్‌ఫోర్స్‌మెంట్ యాక్షన్ కోసం కంటెంట్ విశ్లేషించడం. దీనికి మెంటార్‌గా ఏపీఎస్పీ బెటాలి యన్ డీఐజీ డాక్టర్ ఫకీరప్ప కగినెల్లి వ్యవహరిస్తారు. నాల్గో కేసుగా ఏఐ పవర్డ్ సీడీఆర్/ఐపీడీఆర్‌కు చెందిన పెద్ద వాల్యూమ్స్‌ని విశ్లేషించడం. ఈ కేసుకు మెంటార్‌గా ఏలూరు ఎస్పీ కొమ్మి ప్రతాప్ శివ కిషోర్ ఉంటారు. డయల్ 112, క్రైం హాట్‌స్పాట్స్‌లకు ఎఫ్ఐఆర్‌లు జనరేట్ చేయడం, లాండ్ అండ్ ఆర్డర్ కాపాడేందుకు వేగవంతంగా హెచ్చరికలు పంపేందుకు ఏఐ విశ్లేషణ చేయడం కోసం ఐదు కేసుని నిర్ణయించారు. దీనికి ఐదో బెటాలియన్ కమాండెంట్ మల్లిక గార్గ్ మెంటార్‌గా ఉంటారు. ఆరో కేసుగా రివార్డులు, మెడల్స్ మూల్యాంకనం చేసేందుకు డిజిటల్ సర్వీసు రికార్డు పుస్తకాలను ఏఐ ద్వారా విశ్లేషిచండం. దీనికి ఐజీపీ టీ రాజకుమారి మెంటార్‌గా ఉంటారు. వాట్సాప్, గ్రూపు ఛాట్స్ డేటాని ఏఐ ద్వారా విశ్లేషించి ముఖ్యమైన అంశాలను గుర్తించడం, ముందస్తు హెచ్చరికలు పంపేందుకు ఆరో కేసుగా నిర్ణయించారు. దీనికి విజయనగరం ఎస్పీ వకుల్ జిందాల్ మెంటార్‌గా ఉంటారు. ప్రాంతీయ, ఆంగ్ల దినపత్రికల్లో ప్రచురితమైన వార్తలను ఏఐ ద్వారా విశ్లేషించేందుకు ఎనిమిదో కేసుని తీసుకొన్నారు. దీనికి ఐదో బెటాలియన్ కమాండెంట్ మల్లిక గార్గ్ మెంటార్‌గా వ్యవహరిస్తారు.

ఒక్కో కేసు పరిష్కారానికి నగదు బహుమతులు

పోలీసు శాఖ గుర్తించిన ఎనిమిది హై ఇంపాక్ట్ కేసుల్లో అత్యుత్తమమైన పరిష్కారమార్గాన్ని చూపించిన సాంకేతిక నిపుణులకు నగదు బహుమతిని కూడా ప్రదానం చేయనుంది. ఒక్కో కేసుకు ప్రథమ బహుమతి కింద రూ. 75 వేలు, ద్వితీయ బహుమతిగా రూ. 50 వేలు నగదుని ఇస్తామని ప్రకటించింది. దీంతో దేశ వ్యాప్తంగా అనేకమంది సాఫ్టువేర్ రంగ నిపుణులు రిజిస్ట్రేషన్స్ చేసుకొన్నారు. ముఖ్యంగా శని, ఆదివారంలలో ఈ హ్యాకథాన్‌కు హాజరయ్యేందుకు రానున్నారు.



సమావేశంలో పాల్గొన్న చైర్మన్ యశ్వంత్‌కుమార్, ఈడీ విశ్వశ్రీ

పొగాకు ఉత్పత్తి లక్ష్యం కుదింపు

- 2025-26 పంటకాలానికి 142 మిలియన్ కేజీల పరిమాణం నిర్ధారణ
- గత ఏడాదితో పోల్చితే 25 మిలియన్ కేజీలను తగ్గించిన పొగాకు బోర్డు
- ధర పతనం కావడమే కారణని బోర్డు సమావేశంలో నిర్ణయం

గుంటూరు, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో పొగాకు ఉత్పత్తి లక్ష్యాన్ని టుబాకో బోర్డు కుదించింది. 2025-26 పంటకాలానికి 142 మిలియన్ కేజీల ఉత్పత్తిని నిర్ధారించింది. గురు వారం గుంటూరు నగరంలోని పొగాకు బోర్డు కార్యాలయంలో జరిగిన 165వ సమావేశంలో ప్రజాప్ర తినిధులు, అధికారులు చర్చించి ఈ నిర్ణయాన్ని ప్రకటించారు. టుబాకో బోర్డు ఛైర్మన్ చిడిపోతు యశ్వంత్‌కుమార్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశానికి ఈడీ బీ విశ్వశ్రీ, బెంగళూరు ఆక్షన్స్ డైరెక్టర్ శ్రీనివాస్, వైస్‌ఛైర్మన్ బొడ్డపాటి బ్రహ్మయ్య, బోర్డు సభ్యులు జీసీ విక్రమ్ రాజ్, గుత్తా వాసుబాబు హాజరయ్యారు. సమావేశంలో ప్రధానంగా ప్రస్తుత సంవత్సరంలో పొగాకు రైతుకు తలెత్తిన నష్టాలు, విదేశాల నుంచి వస్తున్న ఎగుమతి ఆర్డర్ల గురించి చర్చించడం జరిగిందని ఛైర్మన్ యశ్వంత్‌కుమార్ తెలిపారు. గత రెండేళ్లలో భారత్‌తో పోటీపడి పొగాకు పండించే బ్రెజిల్, జింబాబ్వే, టాంజానియా, మొజాంబికా తదితర దేశాల్లో పంట తక్కువగా ఉండటం వలన ఇక్కడి రైతులకు అధిక లాభాలు వచ్చాయన్నారు. పొగాకు బోర్డు చరిత్రలో రికార్డు స్థాయిలో 240 మిలియన్ కేజీల పొగాకుని రైతులు ఉత్పత్తి చేశారన్నారు. వాస్తవానికి 2024-25 సంవత్సరానికి 167 మిలియన్ కేజీల ఉత్పత్తినే లక్ష్యంగా నిర్ధారించడం జరిగిందని, అయితే రైతులు అనధికారికంగా వర్జీనియా పొగాకుతో పాటు లోగ్రేడ్, నల్లబర్లీ వంటి రకాలు సాగు చేశారన్నారు. దీని వలన డిమాండ్ లేక ధర తగ్గిందన్నారు. రైతుల ఆందోళనల దృష్ట్యా ఇటీవలే కేంద్ర వాణిజ్య శాఖ మంత్రి పీయూష్ గోయల్ టుబాకో బోర్డు కార్యాలయానికి వచ్చి ఉన్నతస్థాయి సమావేశం నిర్వహించి ఆదేశాలు జారీ చేశారన్నారు. ఆ మేరకు 16 వేలం కేంద్రాలకు లక్ష్యాలను నిర్దేశించామన్నారు. ప్రకాశం, నెల్లూరు, బాపట్ల, నరసరావుపేట, ఏలూరు, జంగారెడ్డిగూడెం, గుంటూరులో ఉత్తరాది తేలికపాటి నేలలు, దక్షిణాది తేలికపాటి నేలలు, దక్షిణాది నల్లరేగడి భూములకు లక్ష్యాలను ఇస్తామన్నారు. బ్యారన్ల వారీగా విభజించి రైతులకు అన్ని వివరాలను తెలియజేస్తామని చెప్పారు. పొగాకు పండించే రైతులంతా బోర్డు నిర్ధారించిన విధంగా పంట పరిమాణానికి లోబడి ఉత్పత్తి చేసి మెరుగైన ధరలను పొందాలని సూచించారు. ఈ సమావేశానికి వర్చువల్ విధానంలో లోక్‌సభ సభ్యుడు పీ మహేష్‌కుమార్, రాజ్యసభ సభ్యుడు డాక్టర్ కే లక్ష్మణ్, వాణిజ్య మంత్రిత్వ శాఖ డైరెక్టర్ మౌనిక గౌర్, నిర్యా రాజమండ్రి డైరెక్టర్ మాగుంట శేషు మాధవ్, వ్యవసాయ శాఖ డైరెక్టర్ ఎస్ డిల్లీరావు, కర్ణాటక వ్యవసాయ శాఖ డైరెక్టర్ డాక్టర్ జీటీ పుత్ర, గుజరాత్, బీహార్, ఉత్తర్‌ప్రదేశ్ రాష్ట్రాల నుంచి అధికారులు హాజరయ్యారు.

నిబంధనలు సడలింపు

(5వ పేజీ తరువాయి)

నిలిపివేసుకుంటున్నారు. పల్నాడు, గుంటూరు, బాపట్ల జిల్లాల్లోని మున్సిపాలిటీల్లో దాదాపు మూడున్నర నెలలుగా ప్లాన్‌లు మంజూరు కాక నిర్మాణాలు నిలిచిపోయాయి.

క్రిమినల్ కేసు నిబంధన ఉపసంహరణ

పట్టణాల్లో ఇళ్ల నిర్మాణానికి సెల్ఫ్ సర్టిఫికేషన్ స్కీమ్ ద్వారా ప్లాన్‌లను పురపాలక సంఘం మంజూరు చేస్తోంది. ఇది భవన నిర్మాణదారులకు ఎంతో మేలు చేస్తుందని ప్రభుత్వం భావించింది. దీంతో అనుమతుల కోసం అధికారుల చుట్టూ తిరగాల్సిన పని ఉండదని ప్రకటించింది. కానీ, నిర్మాణదారుడు మంజూరైన ప్లాన్ ఉల్లంఘించి భవనం నిర్మిస్తే.. లైసెన్స్ రద్దు చేసి, కేసులు నమోదు చేసే విధంగా చట్టాన్ని తీసుకొచ్చింది. ఈ క్రిమినల్ కేసు నిబంధనను ప్రభుత్వం ఉపసంహరిం చుకుంది. మరో పెద్ద సమస్యగా ఉన్న సెట్‌బ్యాక్ విషయంలో కూడా మార్పులు తీసుకొచ్చింది. కొత్త నిబంధన ప్రకారం భవన నిర్మాణానికి రోడ్డు వైపు మూడు మీటర్లు స్థలం వదలాలి. అయితే ఒక మీటరు స్థలం వదిలితే సరిపోతుందని సడలించిన నిబంధనల్లో పేర్కొంది. పట్టణాల్లో లైసెన్స్‌డు సర్వేయర్లు ఇళ్ల నిర్మాణాల ప్లాన్‌లకు దరఖాస్తు చేస్తున్నారు.

మీరితే.. ఎల్‌టీపీలపై వేటు..!

భవన నిర్మాణం కోసం ఆన్‌లైన్‌లో ప్లాన్ నమోదు చేసి, మున్సిపాలిటీకి ఫీజు చెల్లిస్తే అప్రూవల్ వచ్చేస్తుంది. దీంతో నిర్మాణదారుడు వెంటనే ప్లాన్ ప్రకారం పనులు ప్రారంభించవచ్చు. అయితే ఏ కొద్ది పాటి అతిక్రమణ జరిగినా ఎల్‌టీపీలపై వేటు పడుతుంది. ఆరు నెలల పాటు వారిని బ్లాక్ లిస్టులో పెడతారు. ఇటువంటివి పునరావృతమైతే వారి లైసెన్స్ రద్దు చేస్తారు. ఈ నిబంధనను మాత్రం ప్రభుత్వం సడలించలేదని ఎల్‌టీపీలు చెబుతున్నారు.

టౌన్ ప్లానింగ్ చేతిలో నుంచి..

కొత్త విధానం వల్ల పట్టణంలో ప్రతి భవనం నిర్మాణానికి నిబంధనలు పాటించాలి. ఉదాహరణకు 300 చదరపు మీటర్లలో భవన నిర్మాణం చేస్తే.. గతంలో కొంత సడలింపు ఉండేది. మార్టుగేజ్ ఉండడంతో చిన్న చిన్న తేడాలు ఉన్నా పెద్దగా పట్టించుకునేవారు కాదు. ఇప్పుడా పరిస్థితి లేదు. గతంలో టౌన్ ప్లానింగ్ అధికారులు ప్లాన్ ఇచ్చేవారు. కొత్త నిబంధనల ప్రకారం ఎల్‌టీపీ ప్లాన్‌లు ఆన్‌లైన్‌లో నమోదు చేస్తే సదరు అధికారులతో పని లేకుండా ప్లాన్ మంజూరవుతుంది. అపార్టుమెంట్ల విషయంలోనూ ఇదే పరిస్థితి. జీ ప్లస్-5కు గతంలో టౌన్ ప్లానింగ్ ఆర్డీ పరిశీలించి అమోదం తెలిపేవారు. ఏమైనా అభ్యంతరాలుంటే మార్పులు చేసి, ప్లాన్ ఇచ్చేవారు. ఇప్పుడది ఉండదు. మొత్తంమ్మీద కొత్త నిబంధనలు సడలించడంతో యజమానులు భవనాల నిర్మాణాలను ప్రారంభించేందుకు సమాయత్తమవుతున్నారు.

ఆడుదాం ఆంధ్రా.. అవినీతిమయం

(5వ పేజీ తరువాయి)

విచారణ జరిపిన విజిలెన్స్ అధికారులు అవినీతికి సంబంధించిన ఆధారాలు సేకరిస్తున్నారు. గ్రామ, వార్డు సచివాలయాలకు వెళ్లి అప్పట్లో ప్రభుత్వం ద్వారా పంపిణీ అయిన క్రికెట్ కిట్లు ఉన్నాయా లేదా.. కార్యక్రమ నిర్వహణకు ప్రభుత్వం కేటాయించిన నిధులను సక్రమంగా వినియోగించారా లేదా అని అధికారులు పరిశీలిస్తున్నారు. ఉమ్మడి గుంటూరు జిల్లాలో అటవీశాఖాధికారి సైదులు ఆధ్వర్యంలో విచారణ జరుగుతున్నట్లు తెలుస్తుంది. రెండు నెలలుగా జరుగుతున్న విచారణ మరో 10 రోజుల్లో పూర్తి చేసి నివేదికను ప్రభుత్వానికి అందజేసేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారని తెలుస్తుంది.

క్రికెట్ ఆడకుండానే..

గుంటూరు జిల్లాలో 568 సచివాలయాల పరిధిలో 1,29,504 మందికి, 64,752 టీమ్‌లు, పల్నాడు జిల్లాలో 538 సచివాలయాలకు 1,22,664 మందికి 61,332 టీమ్‌లు, బాపట్ల జిల్లాలో 477 సచివాలయాలకు 1,08,756 మందికి 54,378 టీమ్‌లు క్రికెట్ ఆటలో పాలుపంచుకున్నట్లు రికార్డుల్లో చూపారు. ఆ జాబితాల్లోని పలువుర్ని అధికారులు పిలిచి విచారించగా అసలు తమకు ఆడుదాం ఆంధ్రా.. క్రికెట్ ఆట గురించే తెలియదని చెప్పినట్లు తెలుస్తోంది. తాము ఆడకుండానే పేర్లు రాసుకున్నారని చాలామంది చెప్పినట్లు సమాచారం. ఈ మేరకు వారి వాంగ్మూలాలను అధికారులు రికార్డు చేశారు. ఇక రూ.20 వేలు వెచ్చించి క్రికెట్ కిట్లను కొనుగోలు చేశారు. అయితే ఆటల అనంతరం క్రికెట్ కిట్లను మండల విద్యాశాఖాధికారికి అప్పగించాలని ప్రభుత్వం సూచించింది. అయితే ఎక్కువ సచివాలయాల్లో వైసీపీ నాయకులు, వారి అనుచరులకు కిట్లను పందారం చేసినట్లు తెలుస్తుంది. ఈ కార్యక్రమం సందర్భంగా భోజన ఏర్పాట్లకు ఒక్కో వార్డు సచివాలయానికి రూ.లక్ష, గ్రామ సచివాలయానికి రూ.10 వేలు, మండల స్థాయిలో ఎంపీడీవోకు రూ.50 వేల వరకు కేటాయించారు. అయితే ఆ బిల్లులను పరిశీలించిన అధికారులు భోజనాలు పెట్టకపోయినా పెట్టినట్లు చూపించి రూ.50 లక్షలు స్వాహా చేశారని అధికారులు గుర్తించారని సమాచారం. జగన్ బొమ్మతో ఉన్న వేల టీ షర్టులు సచివాలయాల్లో దుమ్ముతో నిండిపోగా వాటి విలువను అధికారులు లెక్కిస్తున్నారు.

విద్యుత్ శాఖ.. సర్కిల్స్ పునర్విభజన

- గుంటూరు, సీఆర్‌డీఏ, బాపట్ల, పల్నాడు సర్కిల్స్‌లో సబ్ డివిజన్‌ల మార్పులు
- సీఆర్డీయే సర్కిల్‌లో కొత్తగా అమరావతి క్యాపిటల్ డివిజన్ ఏర్పాటు

గుంటూరు, జూన్ 26(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ సదరన్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కార్పొరేషన్ లిమిటెడ్ సంస్థలో సర్కిల్స్ పునర్విభజన ప్రక్రియ ఎట్టకేలకు కొలిక్కి వచ్చింది. ప్రస్తుతమున్న జిల్లాల వారీగా సర్కిల్స్‌ను కొనసాగిస్తూ.. అందులో సబ్ డివిజన్‌లలో మార్పులు, చేర్పులు చేస్తూ విభజన ప్రక్రియను పూర్తి చేశారు. ఈ మేరకు సర్కిల్స్ విభజనకు సంబంధించి ఉత్తర్వులను సీపీడీసీఎల్ సీఎండీ పి. పుల్లారెడ్డి గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. ఇటీవల జిల్లాల పర్యటనలో భాగంగా గుంటూరు సర్కిల్ పర్యటనకు వచ్చిన సీఎండీ పుల్లారెడ్డి, టెక్నికల్ డైరక్టర్ ఆవుల మురళీకృష్ణయాదవ్ సంస్థలో సర్కిల్స్ పునర్విభజన ప్రక్రియ చేపట్టామని తెలిపారు. గుంటూరు, పల్నాడు, సీఆర్డీయే, బాపట్ల సర్కిల్స్‌లో ప్రస్తుతం ఉన్న డివిజన్‌లనే కొనసాగిస్తూ సబ్ డివిజన్‌లలో మార్పులు, చేర్పులు చేస్తూ విభజన ప్రక్రియ చేపట్టారు.

● సీఆర్డీయే సర్కిల్‌లో..

మంగళగిరి డివిజన్‌తో పాటు రాజధాని ప్రాంతమైన రాయపూడి కేంద్రంగా అమరావతి క్యాపిటల్ పేరుతో కొత్తగా డివిజన్‌ను ఏర్పాటు చేశారు. గతంలో సీఆర్‌డీఏలో చిలకలూరిపేట, మంగళగిరి కేంద్రంగా అమరావతి డివిజన్ ఉండేది.. దాన్ని తాజాగా పేరు మార్చి రాయపూడి కేంద్రంగా అమరావతి క్యాపిటల్ డివిజన్‌ను ఏర్పాటు చేస్తూ నిర్ణయం తీసుకున్నారు. అమరావతి క్యాపిటల్ డివిజన్ లో అమరావతి టౌన్, అమరావతి రూరల్, మంగళగిరి టౌన్, మంగళగిరి రూరల్ పేరుతో నాలుగు సబ్ డివిజన్‌లు కాగా... 13 సెక్షన్ కార్యాలయాలను ఏర్పాటు చేశారు. గతంలో సీఆర్‌డీఏలో 15 సెక్షన్‌లు ఉండేవి.

● గుంటూరు సర్కిల్‌లో....

గుంటూరు సర్కిల్ పరిధిలో గుంటూరు టౌన్-1, తెనాలి డివిజన్‌లుండగా గుంటూరు టౌన్-1, 2, 3, 4 కాగా తెనాలి టౌన్, తెనాలి రూరల్, పొన్నూరుతో మొత్తం 7 సబ్ డివిజన్‌లున్నాయి. రెండు డివిజన్‌లలో కలిపి మొత్తం 25 సెక్షన్‌లను ఏర్పాటు చేశారు. కాగా గతంలో 8 సబ్ డివిజన్‌లలో ఒకటి కుదించగా గతంలో 29 సెక్షన్‌లున్నాయి.

● పల్నాడు సర్కిల్‌లో.....

పల్నాడు సర్కిల్‌లో గతంలో నరసరావుపేట, మాచర్ల డివిజన్‌లుండగా కొత్తగా చిలకలూరిపేట డివిజన్‌తో మొత్తం మూడు డివిజన్‌లను ఏర్పాటు చేశారు. మాచర్ల డివిజన్‌లో దాచేపల్లి, గురజాల, మాచర్ల, పిడుగురాళ్ళ సబ్ డివిజన్‌లు కాగా, నరసరావుపేట డివిజన్‌లో నరసరావుపేట టౌన్, నరసరావుపేట రూరల్, వినుకొండ సబ్ డివిజన్‌లుండగా, చిలకలూరిపేట డివిజన్‌లో చిలకలూరిపేట, సత్తెనపల్లి టౌన్, సత్తెనపల్లి రూరల్ సబ్ డివిజన్‌లతో మొత్తం పది సబ్ డివిజన్‌లు, 38 సెక్షన్‌లతో పల్నాడు సర్కిల్ విభజించారు.

● బాపట్ల సర్కిల్‌లో

బాపట్ల సర్కిల్‌లో బాపట్ల, చీరాల, అద్దంకి డివిజన్‌లు యథాతదంగా ఉన్నాయి. గతంలో ఇక్కడ 8 సబ్ డివిజన్‌లుండగా కొత్తగా మరో సబ్ డివిజన్‌తో మొత్తం 9 సబ్ డివిజన్‌లు, 31 సెక్షన్‌లతో ఏర్పాటు చేశారు. అద్దంకి డివిజన్‌లో అద్దంకి, మార్టూరు సబ్ డివిజన్‌లు కాగా, బాపట్ల డివిజన్‌లో బాపట్ల, చెరుకుపల్లి, చుండూరు, రేపల్లె సబ్ డివిజన్‌లు, చీరాల డివిజన్‌లో చీరాల, పర్చూరు, వేటపాలెం సబ్ డివిజన్‌లున్నాయి. ఇక్కడ గతంలో 28 సెక్షన్ కార్యాలయాలుండగా కొత్తగా 31 సెక్షన్‌లు ఏర్పాటు చేశారు.

కాంగ్రెస్ బలోపేతానికి వ్యూహాలు

గ్రామస్థాయి నుంచి పార్టీ నిర్మాణంపై దృష్టి

పల్నాడు జిల్లా సమావేశంలో ఏపీసీసీ చీఫ్ షర్మిలారెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న పీసీసీ చీఫ్ వైఎస్ షర్మిలారెడ్డి

నరసరావుపేట టౌన్, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి వ్యూహాలు రచిస్తున్నట్లు ఏపీసీసీ చీఫ్ షర్మిలారెడ్డి తెలిపారు. నరసరావుపేటలోని భువనచంద్ర టౌన్ హాల్‌లో గురువారం పల్నాడు జిల్లా కాంగ్రెస్ పార్టీ విస్తృతస్థాయి సమావేశంలో ఆమె ప్రసంగించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ బలపడటం రాజకీయంగా చాలా అవసరమని చెప్పారు. గ్రామ స్థాయి నుంచి పార్టీ నిర్మాణంపై దృష్టి పెట్టామన్నారు. పార్టీ బలోపేతానికి సంబంధించి జిల్లా స్థాయి విస్తృతస్థాయి సమావేశాల్లో నేతల ఇచ్చిన సూచనలను పరిగణనలోకి తీసుకుంటున్నామన్నారు. బీజేపీతో సంబంధాల కోసం టీడీపీ, వైసీపీ, జనసేన పార్టీలు రాష్ట్ర ప్రయోజనాలను తాకట్టు పెట్టాయని విమర్శించారు. ప్రస్తుతం రాష్ట్రంలో స్వార్థ రాజకీయాలు నడుస్తున్నాయన్నారు. సమావేశంలో పల్నాడు జిల్లా పరిశీలకుడు మధన మోహన్‌రెడ్డి, కాంగ్రెస్ కిసాన్ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కామన ప్రభాకర్, అధికార ప్రతినిధి నాగరాజు, పల్నాడు డీసీసీ అధ్యక్షుడు గర్నెపూడి అలెగ్జాండర్ సుధాకర్‌తో పాటు నాయకులు, నియోజకవర్గ ఇన్‌చార్జిలు కమలాకర్, వై.రామచంద్రారెడ్డి, టి.యలమందారెడ్డి, బి.రామాంజనేయులు, పి.నాగేశ్వరరావు, సీహెచ్ చంద్రపాల్, ఎం.రాధాకృష్ణ, ఎస్ఎం బాష పాల్గొన్నారు.



చంద్రబాబుతో పాటు ర్యాలీలో పాల్గొన్న కేంద్ర మంత్రి పెమ్మసాని ఎమ్మెల్యేలు రామాంజనేయులు నసీర్



మాదకద్రవ్యాలకు వ్యతిరేకంగా ప్రతిజ్ఞ చేస్తున్న ఎమ్మెల్యేలు, తెలుగుదేశం నాయకులు, విద్యార్థులు



ప్రజా చైతన్యంతోనే.. డ్రగ్స్ కట్టడి



ఫొటో ఎగ్జిబిషన్‌ను పరిశీలిస్తున్న చంద్రబాబు, డీజీపీ హరీష్‌కుమార్‌గుప్తా

(5వ పేజీ తరువాయి)

వెళ్లాలన్నారు. గంజాయి, డ్రగ్స్‌ను నియంత్రించకపోతే జాతి నిర్వీర్యమవుతుందన్నారు. జీరో డ్రగ్స్‌కు ప్రతి ఒక్కరు సహకరిస్తే రాష్ట్రంలో 100 శాతం శాంతిభద్రతలను కాపాడే బాధ్యత తాను తీసుకుంటానన్నారు. ప్రత్తిపాడు ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు మాట్లాడుతూ 2047 నాటికి రాష్ట్రంలో ప్రతి ఒక్కరూ ఆనందంగా, ఆరోగ్యంగా, ఆర్థికంగా సుసంపన్నంగా ఉండాలన్నదే లక్ష్యంగా చంద్రబాబు విజన్‌తో పనిచేస్తున్నారన్నారు. ఈగల్ ద్వారా ఈ ఏడాదిలో తీసుకున్న చర్యలను ఐజీ రవికృష్ణ వివరించారు.

విద్యార్థులతో భారీ ప్రదర్శన

తొలుత స్థానిక అమరావతిరోడ్డులోని జ్వరాల ఆస్పత్రి నుంచి చిల్లీస్ రెస్టారెంట్ వరకు వాక్‌థాన్ నిర్వహించారు. డ్రగ్స్ వ్యతిరేక నినాదాలతో విద్యార్థులు హోరెత్తించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు సహా అధికారులు, ప్రజాప్రతినిధులు విద్యార్థులతో కలిసి ర్యాలీలో పాల్గొన్నారు. అనంతరం చంద్రబాబు చిల్లీస్ సెంటర్లోని ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలవేసి నివాళులు అర్పించారు. అనంతరం శ్రీకన్వెన్షన్ సెంటర్లో ఏర్పాటు చేసిన ఫొటో ఎగ్జిబిషన్‌ను చంద్రబాబు తిలకించారు. అవగాహన సదస్సుకు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలకు మంచి స్పందన లభించింది. ఈ కార్యక్రమాల్లో కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, రాష్ట్ర మంత్రులు వంగలపూడి అనిత, డోలా బాలవీరాంజనేయులు, సంధ్యారాణి, మేయర్ కోవెలమూడి నాని, ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్, ఎమ్మెల్యేలు ధూళిపాళ్ల నరేంద్ర, తెనాలి శ్రావణ్‌కుమార్, గళ్లా మాధవి, నసీర్‌అహ్మద్, భాష్యం ప్రవీణ్, డీజీపీ హరీష్‌కుమార్‌గుప్తా, కలెక్టర్ నాగలక్ష్మి, కార్పొరేషన్ల చైర్మన్లు డేగల ప్రభాకర్, గోనుగుంట్ల కోటేశ్వరరావు, హసన్‌బాషా, రాయపాటి శైలజ, నాయకులు నన్నపనేని రాజకుమారి, ముత్తినేని రాజేష్, చిట్టాబత్తిన చిట్టిబాబు, శివనాగమల్లేశ్వరరావు(మల్లి), వేములకొండ శ్రీనివాసరావు, రావిపాటి సాయికృష్ణ, మన్నవ వంశీ, షేక్ సజీల, కొమ్మినేని సాంబశివరావు, తదితరులు పాల్గొన్నారు.



గజమాలతో చంద్రబాబుకు స్వాగతం

దుగ్గిరాల యార్డులో పసుపు ధరలు

దుగ్గిరాల, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): స్థానిక పసుపు మార్కెట్ యార్డులో గురువారం జరిగిన వేలంలో 596 బస్తాల పసుపు విక్రయాలు జరిగాయి. కొమ్ములు క్వింటాల్‌కు కనిష్ఠధర రూ.9,650, గరిష్ఠధర రూ.11,000, మోడల్‌ధర రూ.10,450 పలికాయి. కాయ క్వింటాల్‌కు కనిష్ఠధర రూ.9,600, గరిష్ఠధర రూ.10,500, మోడల్‌ధర రూ.10,400 పలికాయి.

టీడీపీ పట్టణ ఉపాధ్యక్షుడికి షోకాజ్ నోటీసు

మంగళగిరిసిటీ, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): మంగళగిరి పట్టణ టీడీపీ ఉపాధ్యక్షుడు గోవాడ దుర్గారావుకు నియోజకవర్గ పార్టీ కార్యాలయం నుంచి షోకాజ్ నోటీసు జారీ చేశారు. ఆయన ప్రవర్తనపై పార్టీ శ్రేణుల నుంచి పలు ఫిర్యాదులు వచ్చిన నేపథ్యంలో క్రమశిక్షణా చర్యల్లో భాగంగా నోటీసు ఇచ్చారు. తనపై వచ్చిన ఆరోపణలపై ఈ నెల 28వ తేదీ సాయంత్రం ఐదు గంటల్లోగా స్పందించాలని, తగిన వివరణ సమర్పించని పక్షంలో పార్టీ క్రమశిక్షణా చర్యలు చేపడుతుందని షోకాజ్ నోటీసులో పేర్కొన్నారు.

30న నేత్ర వైద్యశిబిరం

దుగ్గిరాల, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): దుగ్గిరాలలోని దోస్త్ స్వచ్ఛందసేవా సంస్థ ఆధ్వర్యంలో ఉచిత నేత్ర వైద్యశిబిరాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ నెల 30వతేదీ సోమవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకూ మెయిన్ రోడ్‌లోని జంపాల కాంప్లెక్స్‌పై జరుగు ఉచిత నేత్ర పరీక్షా శిబిరాన్ని దుగ్గిరాల పరిసర గ్రామాల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

'28న చలో తెనాలి' కరపత్రాల ఆవిష్కరణ

దుగ్గిరాల, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): దళిత, బహుజన సంఘాల ఆధ్వర్యంలో ఈ నెల 28న తెనాలిలో జరుగనున్న బహిరంగసభను విజయవంతం చేయాలని కోరుతూ చిలువూరులో కరపత్రాలను ఆవిష్కరించారు. సీపీఎం మండల కార్యదర్శి జెట్టి బాలరాజు, పలువురు దళిత బహుజనులు పాల్గొన్నారు. తెనాలిలో దళిత, మైనార్టీ యువకులను పోలీసులు బహిరంగంగా లాఠీలతో కొట్టిన ఘటనపై హైకోర్టు సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని కోరుతూ, నిర్వహించనున్న సదస్సులో పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు.

5న జాతీయ లోక్ అదాలత్

మంగళగిరి, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ, గుంటూరు ఆదేశాల మేరకు జూలై 5వ తేదీన జాతీయ లోక్ అదాలత్ కార్యక్రమం నిర్వహించామని డీఎల్ఎస్ఏ చైర్మన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి బీ సాయికళ్యాణ చక్రవర్తి గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. రాజీపడదగ్గ కేసులను జాతీయ లోక్ అదాలత్‌లో కక్షిదారులు సమస్యలు పరిష్కరించుకుని సత్వరన్యాయం పొందాలని ఆయన ఆ ప్రకటనలో కోరారు. లోక్ అదాలత్ ద్వారా సత్వరన్యాయం అందుతుందన్నారు. ఆయా కోర్టుల పరిధిలోని కక్షిదారులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.

వారాహి నవరాత్రులు ప్రారంభం

మంగళగిరిసిటీ, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): మంగళగిరి మెయిన్ బజారులోని శ్రీవాసవీ కన్యకా పరమేశ్వరీ లక్ష్మీ గణపతి కోదండ రామస్వామి వార్ల దేవస్థానంలో గురువారం నుంచి వారాహి నవరాత్రులు ప్రారంభమయ్యాయి. తొలిరోజు ఉదయం గణపతి పూజ, దీక్షాధారణ, కలశ స్థాపన, అమ్మవారికి ప్రీతి ప్రదమైన కుబేర కుంకుమలతో అష్టోత్తర శతనామ అర్చన, సాయంత్రం వారాహి సహస్రనామ స్తోత్ర పారాయణం, నీరాజన మంత్ర పుష్పం నిర్వహించారు. వచ్చే నెల 5వ తేదీ వరకు నవరాత్రి ఉత్సవాలు జరుగుతాయని, ప్రతిరోజు మహాలక్ష్మీ హోమం జరుగుతుందని నిర్వాహకులు తెలిపారు.

మహిళలపై కేసులు ఎత్తి వేయాలి

తుళ్లూరు(మందడం), జూన్ 26 (ఆంధ్రజ్యోతి): అసెంబ్లీకి కూతవేటు దూరంలో మందడం దళితకాలనీలో తాగునీరు రావటం లేదని ఆందోళన వ్యక్తం చేసిన దళిత మహిళలపై పెట్టిన కేసులు ఎత్తి వేయాలని గురువారం మందడంలోని తుళ్లూరు డీఎస్పీ కార్యాలయంలో ప్రజా సంఘాల నేతలు సీసీకి అర్జీ అందజేశారు. రాజధానిలో మంచి నీళ్లు రావటం లేదని అడిగినందుకు తుళ్లూరు పోలీసులు కేసు పెట్టటం ఏమిటని ఎం రవి, ఎం భాగ్యరాజు ధ్వజమెత్తారు. రాజధాని గ్రామంలో మంచి నీటి సౌకర్య లేక ఇబ్బందులు పడుతుంటే పంచాయతీ, సీఆర్డీఏ అధికారులు ఒకరిమీద ఒకరు చెపుకుంటూ కాలం వెళ్లబుచ్చుతున్నారని నేతలు అన్నారు. ప్రజలకు వెంటనే మంచి నీరు అందించే విధంగా చర్యలు చేపట్టాలని వారు కోరారు.

సమాజానికి చీడపీడలు మాదకద్రవ్యాలే : ఎంఈవో

కాకుమాను, జూన్ 26(ఆంధ్రజ్యోతి): సమాజానికి చీడపీడలు మాదకద్రవ్యాలేనని ఎంఈవో కొల్లి విజయ భాస్కరరావు, స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారి రాజశేఖర్ అన్నారు. కాకుమానులో గురువారం ప్రపంచ పొగాకు, మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక హైస్కూల్ విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి మాట్లాడుతూ పొగాకు, మాదక ద్రవ్యాలు వినియోగం ద్వారా కలిగే నష్టాలను వివరించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం వెంకట్రావు, భాస్కర్, పలు ప్రభుత్వ శాఖల అధికారులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

క్రీస్తు నగర్‌కు తాగునీరు ఇవ్వాలి

ఫిరంగిపురం, జూన్ 26 (ఆంధ్రజ్యోతి) : ఫిరంగిపురంలోని క్రీస్తునగర్‌లో 15 రోజుల నుంచి తాగునీరు రాక ఇబ్బందులు పడుతున్నామని మహిళలు గురువారం పంచాయతీ ఈవో ఏ కిషోర్‌బాబును కలసి విన్నవించుకున్నారు. తాగునీరు లేక డబ్బాలతో నీరు కొనుక్కోవాల్సి వస్తుందని, దూరం వెళ్ళి నీరు తెచ్చుకోవాల్సి వస్తుందని వారు వాపోయారు. దీనిపై స్పందించిన ఈవో పైపులైన్ లీకేజీ అయి నీరు రావటం లేదని, వెంటనే తాగునీరు ఇచ్చేలా కృషి చేస్తానని ఆయన మహిళలకు హామీ ఇచ్చారు.

ఇన్‌చార్జ్ పాలనతో అవస్థలు

- నాలుగు నెలలుగా భర్తీకాని హౌసింగ్ ఏఈ పోస్టు
- సచివాలయాల ఈఏకు ఇన్‌చార్జ్‌గా బాధ్యతలు
- కార్యాలయం చుట్టూ తిరుగుతున్న ప్రజలు
- పట్టించుకోని ఉన్నతాధికారులు



గృహనిర్మాణ శాఖ కార్యాలయం ఎదుట పడిగాపులు కాస్తున్న లబ్ధిదారులు

పెదనందిపాడు, జూన్ 26(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి పేదల సొంతింటి కల నెరవేర్చేందుకు ఎన్టీఆర్ గృహ నిర్మాణం, పీఎం ఆవాస్ యోజన కింద సొంత స్థలం కలిగిన వారికి ఇళ్ల నిర్మాణాలు చేపట్టేందుకు శ్రీకారం చుట్టింది. నాలుగు నెలలుగా మండలంలో గృహ నిర్మాణ శాఖ అధికారి లేకపోవడంతో లబ్ధిదారులు లబోదిబోమంటున్నారు. ఇళ్ల నిర్మాణం కోసం అర్జీలను తీసుకొని లబ్ధిదారులు కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు. కార్యాలయ సిబ్బంది ఎప్పుడు వస్తారో.. ఎప్పుడు వెళ్తారో తెలియని పరిస్థితి ఏర్పడింది. ఇచ్చిన అర్జీలను అప్‌లోడ్ చేసారో లేదో, ఇళ్ల నిర్మాణాలు ఎప్పుడు చేపట్టాలో అనే సమాచారం తెలిపే నాథుడే లేడని లబ్ధిదారులు వాపోతున్నారు. ప్రభుత్వం మండల అధికారిని నియమించకపోగా రెండు సచివాలయాలకు ఇంజనీరింగ్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న గ్రామస్థాయి అధికారినే మండల ఇన్‌చార్జ్ అధికారిగా నియమించారు. కానీ ఆ అధికారి గ్రామాల్లో బాధ్యతలు ఉండటమో లేక మరే ఇతర కారణాలో కానీ మండల కార్యాలయంలో అందుబాటులో ఉండని పరిస్థితి. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి మండల అధికారిని నియమించి తమ సమస్యలను పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.

సహకార సంఘాలకు బకాయిలు చెల్లించాలి

- **లోకేశ్‌కు చేనేత కార్మిక సంఘం నేతల వినతి**



మంత్రి లోకేశ్‌కు వినతిపత్రం అందజేస్తున్న చేనేత కార్మిక సంఘం నేతలు

మంగళగిరి సిటీ, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): చేనేత సహకార సంఘాలకు ప్రభుత్వం చెల్లించవలసిన రూ.156 కోట్ల బకాయిలు వెంటనే చెల్లించాలని ఏపీ చేనేత కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ నేతలు కోరారు. ఈ మేరకు గురువారం రాష్ట్ర ఐటీ, విద్యా శాఖల మంత్రి నారా లోకేశ్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. రాష్ట్రంలో వ్యవసాయం తర్వాత ప్రధాన వృత్తిగా ఉన్న చేనేత కార్పొరేట్ విధానాల వల్ల సంక్షోభం లో చిక్కుకుపోయిందని, ఫలితంగా నేత కార్మికులు ఆకలిచావులు, ఆత్మహత్యలకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. బీజేపీ ప్రభుత్వం చేనేతపై జీఎస్టీ విధించడంతో పరిశ్రమ మరింత సంక్షోభంలోకి నెట్టబడిందన్నారు. గత ప్రభుత్వం నేతన్న నేస్తం పథకం చేనేత షెడ్డు కార్మికులకు అమలు చేయలేదన్నారు. 2024-25 బడ్జెట్‌లో చేనేతకు నామమాత్రం గా కేటాయింపులు జరిగాయన్నారు. యార్న్ సబ్సిడీ, పావలా వడ్డీ కింద రూ.156 కోట్లు వెంటనే చెల్లించాలని, త్రిఫ్ట్ ఫండ్ రూ.5 కోట్లు విడుదల చేయాలని విజ్ఞప్తి చేశారు. రాష్ట్రంలో నేత నేస్తున్న ప్రతి కార్మికుడికి, మగ్గాల షెడ్డులో నేస్తున్న వారికి, అనుబంధ వృత్తుల వారికి, సహకార సంఘాల్లో నేత నేస్తున్న వారికి ఇంటికి 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్తు పథకం అమలు చేయాలని విన్నవించారు. ఆయా సమస్యలపై లోకేశ్ సానుకూలంగా స్పందించినట్టు చేనేత కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పిల్లలమర్రి బాలకృష్ణ తెలిపారు. కార్యక్రమంలో ఏపీ చేనేత కార్మిక సంఘం అధ్యక్షుడు కట్టా శివ దుర్గారావు, నేతలు డోకుపర్తి రామారావు, అనుమల వీరబ్రహ్మం, కౌతరపు వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

రసాభాసగా మండల సర్వసభ్య సమావేశం

- లెక్కలు చెప్పలేదంటూ ఎంపీడీవోపై ఆగ్రహం
- సభ నుంచి ఎంపీటీసీల బాయ్‌కట్



ఎంపీడీవో శివకుమారిని లెక్కలు అడుగుతున్న వైసీపీకి చెందిన ఎంపీటీసీ సభ్యులు

ప్రత్తిపాడు, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): ప్రత్తిపాడు మండల పరిషత్ సర్వసభ్య సమావేశం వాడివేడిగా సాగింది. గత మూడు సర్వసభ్య సమావేశాల నుంచి మండలానికి వచ్చిన గ్రాంట్లతో దేనికి ఎంత ఖర్చు పెట్టారో చెప్పాలంటూ అడుగుతున్నా మీరు ఇంతవరకు ఎందుకు చెప్పలేదంటూ ఎంపీడీవో శివపార్వతిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. సభ ప్రారంభం కాకముందు నుంచే మండల పరిషత్ కార్యాలయం వద్ద వాతావరణం వేడెక్కింది. బయట కూర్చున్న గొట్టిపాడు ఎంపీటీసీ సభ్యురాలు బూసి సువార్తమ్మతో సంతకం చేయించు కోవడంపై వైసీపీ నాయకులు ఎంపీడీవోపై మండిపడ్డారు. తనకు తెలియదని, అటెండర్ ఎందుకు పెట్టించుకుందో అంటూ ఎంపీడీవో సమాధానం చెప్పడం, అటెండర్‌పై వైసీపీ నాయకులు విరుచుకుపడ్డారు. ఆ తరువాత సభ ప్రారంభం కావడంతోనే ఎంపీడీవోను నడింపాలెం ఎంపీటీసీ సభ్యులు మాణిక్యరావు లెక్కలు ఎందుకు చెప్పడం లేదంటూ ప్రశ్నించారు. తాను వచ్చిన తరువాత ప్రభుత్వం నుంచి ఇంత వరకు ఎలాంటి నిధులు రాలేదంటూ ఎంపీడీవో తెలిపారు. గత ప్రభుత్వంలో వచ్చిన లెక్కలు చెప్పాలన్నారు. సభ అనంతరం ఎంపీపీ ఛాంబర్‌లో మీకు అన్ని లెక్కలు వివరిస్తానంటూ ఎంపీడీవో తెలిపారు. తమ పనులు ఒక్కటి కూడా కావడం లేదని, ప్రజలకు సమాధానం చెప్పలేక పోతున్నామని, ఇక్క పని కూడా చేయించుకో లేక పోతున్నామంటూ వైసీపీ ఎంపీటీసీలు ఎంపీపీ అన్నమ్మ మీద గుర్రును ప్రదర్శించారు. ఎంపీడీవో లెక్కలు చెప్పని కారణంగా తాము సభను బాయ్‌కట్ చేస్తున్నామంటూ ఎంపీటీసీలు బయటకు వెళ్లిపోయారు. వారు వెళ్లిన తరువాత సభ యథావిధిగా సాగింది.

వైసీపీ నాయకుల వల్ల మాకు న్యాయం జరగటం లేదు

- బలసాని కిరణ్‌కుమార్ వద్దకు వెళితే కోప్పడుతున్నాడు
- ఎంపీపీ మార్పు విషయంలో వైసీపీ ఎంపీటీసీల అసహనం

ప్రత్తిపాడు, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): వైసీపీలో ఉన్న నాయకుల వల్ల తమకు న్యాయం జరగటం లేదంటూ ఆ పార్టీకి చెందిన ఏడుగురు ఎంపీటీసీలు మండల పరిషత్ కార్యాలయం వద్ద అసహనం వ్యక్తం చేశారు. ప్రత్తిపాడు వైసీపీకి చెందిన ఎంపీపీ దాసరి అన్నమ్మపై సొంత పార్టీకి చెందిన ఎంపీటీసీలు తీవ్ర స్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గత స్థానిక సంస్థల ఎన్నికల సమయంలో దాసరి అన్నమ్మకు రెండున్నర సంవత్సరాలు, బూసి సువార్తకు రెండున్నర సంవత్సరాలు అంటూ అప్పటి ఎమ్మెల్యే మేకతోటి సుచరిత సమక్షంలో అగ్రిమెంటు రాసుకున్నారు. రెండున్నర సంవత్సరాలు దాటినా ఇంతవరకు తమకు ఎంపీపీ పదవి ఇవ్వకపోవడంతో ఆ వర్గం వారి స్వరం వినిపించింది. అసెంబ్లీ ఎన్నికలకు ముందు బలసాని కిరణ్‌కుమార్‌ను ప్రత్తిపాడుకు ఇన్‌చార్జిగా ఇచ్చిన సమయంలో ఆయన్ను సంప్రదిస్తే ఇప్పుడు ఎన్నికల సమయం కదా.. ఇప్పుడు వద్దు, ఎన్నికలు అయిన తరువాత మాట్లాడదాం అంటూ దాట వేశారని, ఎన్నికల తరువాత ఎన్నిసార్లు అడిగినా సమాధానం చెప్పకపోగా కోప్పడుతున్నాని ఎంపీటీసీలు వాపోయారు. ఇదే విషయంపై అంబటి రాంబాబు, లేళ్ల అప్పిరెడ్డిని కూడా కలవడం జరిగిందన్నారు. త్వరలోనే అవిస్వాసం పెట్టి దింపుతామంటూ స్పష్టం చేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీలు బూసి సువార్తమ్మ, వాసిమళ్ల మాణిక్యరావు, సురేష్, సుభాషిణి, మరియరాణి, గురుగూరి చాముండేశ్వరి, నేలపాటి స్వప్న, కో ఆప్షన్ మెంబర్ వసీమ్ ఉన్నారు.

కార్మిక సమస్యలపై పోరాటాలు ఉధృతం

మంగళగిరి సిటీ, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాప్తంగా కార్పొరేషన్, మున్సిపాలిటీల్లో పనిచేస్తున్న పారిశుధ్య, ఇంజనీరింగ్ కార్మికుల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించకపోతే పోరాటాలను ఉధృతం చేస్తామని ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కే.ఉమామహేశ్వరరావు హెచ్చరించారు. మంగళగిరి సీఐటీయూ కార్యాలయంలో గురువారం జరిగిన మంగళగిరి, తాడేపల్లి, రాజధాని ప్రాంత పారిశుధ్య కార్మికులు, ఇంజనీరింగ్ కార్మికుల విస్తృత సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్మికుల సమస్యలపై అనేక మార్లు మున్సిపల్ శాఖా మంత్రిని, అధికారులను కలిసినప్పటికీ పట్టించుకోవడం లేదని విమర్శించారు. ఎన్నికలకు ముందు జరిగిన సమ్మె ఒప్పందాలను అమలు చేయాలని, పారిశుధ్య కార్మికులు, ఇంజనీరింగ్ కార్మికులు, ఇతర కార్మికులందరికీ సమానంగా వేతనాలు ఇవ్వాలని, డిమాండ్ చేశారు. జూలై ఒకటో తేదీన రాష్ట్ర వ్యాప్తంగా కార్మికులు నల్ల రిబ్బన్లు ధరించి ర్యాలీ నిర్వహించాలని, 4న విజయవాడలో జరిగే కార్యక్రమానికి పెద్ద సంఖ్యలో తరలిరావాలని, 9న జరిగే సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో సీఐటీయూ నేతలు యూ దుర్గారావు, చెంగయ్య, బీ వెంకటేశ్వర్లు, ఎం రవి, ఎం బాలాజీ, కే శ్రీనివాసరావు, ఎం శ్రీనివాసరావు, కే.వెంకటేశ్వరమ్మ, వెంగమ్మ, పార్వతి, దానియేలు పాల్గొన్నారు.

చెత్తరహిత గ్రామాలుగా తీర్చిదిద్దాలి : ఎంపీడీవో

తాడికొండ, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): పారిశుధ్యంపై దృష్టి సారించి చెత్త రహిత గ్రామాలుగా తీర్చిదిద్దాలని ఎంపీడీవో కే సమతావాణి తెలిపారు. గురువారం తాడికొండ ఎస్సీ కాలనీలో చేస్తున్న పారిశుధ్య పనులను ఎంపీడీవో సమతావాణి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామాల్లో పారిశుధ్య కార్మికులతో చెత్త సేకరణ చేయించాలని పంచాయతీ కార్యదర్శులకు ఆదేశాలు జారీ చేశారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ ఈవోపీఆర్డీ అరుణ్‌కుమార్, పంచాయతీ సెక్రటరీలు, సిబ్బంది పాల్గొన్నారు.

అప్పాపురంలో చెత్త సేకరణపై విచారణ

కాకుమాను, జూన్ 26(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని అప్పాపురంలో ఎంపీడీవో యుగకీర్తి గురువారం రాత్రి చెత్త సేకరణపై విచారణ చేశారు. ఎస్సీ కాలనీలో గృహాల్లోని వృద్ధులు, మహిళలను గ్రామంలో చెత్త సేకరణ సరిగ్గా జరుగుతుందా లేదా అని వాకబు చేశారు. గ్రామంలో కొన్ని రహదారుల్లో మాత్రమే చెత్త సేకరణ జరగడంపై పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసరావుపై అసహనం వ్యక్తం చేశారు. ఈవోపీఆర్డీ రవికుమార్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

వాటర్ ప్లాంట్ నిర్మాణానికి శంకుస్థాపన

తాడేపల్లి టౌన్, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): మంత్రి నారా లోకేశ్ స్ఫూర్తితో దివీస్ లాబొరేటరీ సహకారంతో చేపడుతున్న వాటర్‌ప్లాంట్ నిర్మాణానికి గురువారం శంకుస్థాపన కార్యక్రమం జరిగింది. తాడేపల్లి మెయిన్ రోడ్డులోని గణేష్ కళామండపం వద్ద మున్సిపల్ స్థలంలో ఈ ప్లాంట్ నిర్మాణం చేపడుతున్నట్టు అధికారులు తెలిపారు. ఈ పనులను టీడీపీ నియోజకవర్గ పరిశీలకులు ముమ్మడి సత్యనారాయణ, పట్టణ అధ్యక్షుడు వల్లభనేని వెంకట్రావు, దివీస్ ప్రతినిధులు మున్సిపల్ అధికారులతో కలిసి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్లు ఓలేటి రాము, కేశి వెంకటేశ్వరరావు, టీడీపీ నేతలు మేకా పుల్లారెడ్డి, అద్దంకి మురళి, మున్సిపల్ ఏఈ అనూష తదితరులు పాల్గొన్నారు.

మాదక ద్రవ్య వ్యతిరేక దినోత్సవ ర్యాలీ



తాడేపల్లిలో ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

తాడేపల్లి టౌన్, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ మాదకద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం సందర్భంగా లవ్ అండ్ కేర్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో గురువారం తాడేపల్లిలో ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీ ముగ్గురోడ్డు నుంచి తాడేపల్లి పోలీసుస్టేషన్ మీదుగా ఉండవల్లి సెంటర్ వరకు జరిగింది. విద్యార్థులు మాదక ద్రవ్యాల వినియోగానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. మాదక ద్రవ్యాల వినియోగం వల్ల కలిగే నష్టాల మీద అవగాహన కల్పించే కరపత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో లవ్‌అండ్‌కేర్ చారిటబుల్ డైరెక్టర్ బండ్లమూడి జాషువ, ప్రసాద్, జార్జి, భాను, తదితరులు పాల్గొన్నారు.

చలపతి ఫార్మసీలో అవగాహనా సదస్సు

తాడికొండ(లాం), జూన్ 26(ఆంధ్రజ్యోతి): మాదక ద్రవ్యాలను అరికట్టడానికి సమాజం మొత్తంగా కలిసికట్టుగా ముందుకు రావాల్సిన ఒక నైతిక, సామాజిక బాధ్యత అని గుంటూరు ప్రభుత్వ వైద్యశాల డెడికేషన్ సెంటర్ మెడికల్ ఆఫీసర్ షేక్ ఫర్హాట్ సుల్తానా పేర్కొన్నారు. గురువారం ప్రపంచవ్యాప్తంగా అంతర్జాతీయ మాదకద్రవ్యాల వినియోగ నిరోధక, అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవం సందర్భాన్ని పురస్కరించుకొని లాం చలపతి ఫార్మసీ కళాశాలలో ఫార్మసీ ప్రాక్టీస్, ఈగల్ క్లబ్ వారు సంయుక్తంగా కలిసి వ్యసనంపై పోరాటం, అవగాహన, చర్య జవాబుదారీతనం అను అంశంపై గెస్ట్ లెక్చర్‌ను నిర్వహించారు.

చిరువ్యాపారులకు తోపుడు బండ్లు పంపిణీ



అనంతవరం గ్రామంలో చిరువ్యాపారులకు తోపుడు బండ్లు అందిస్తున్న దాత కిరణ్‌కుమార్, టీడీపీ నాయకులు

తుళ్లూరు(అనంతవరం), జూన్ 26(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని అనంతవరం గ్రామంలో టీడీపీ మండల మాజీ అధ్యక్షుడు జొన్నలగడ్డ కిరణ్‌కుమార్ చిరువ్యాపారులకు 3 టిఫిన్ బండ్లు, 12 తోపుడు బండ్లు, 4 ఇస్త్రీ బండ్లు గురువారం అందజేశారు. కిరణ్‌కుమార్ ఆర్థిక సహకారంతో పేదలకు ఈ తోపుడు బండ్లను అందజేశారు. మండల వ్యాప్తంగా పలు గ్రామాల్లో 432 తోపుడు బండ్లను పేద చిరువ్యాపారులకు కిరణ్ అందజేశారు. మంత్రి నారా లోకేశ్ స్ఫూర్తితో పేదలకు చేయూతనివ్వటాని తోపుడు బండ్లు అందిస్తున్నట్టు కిరణ్ ఈ సందర్భంగా తెలిపారు. కార్యక్రమంలో గ్రామ అధ్యక్షుడు బండ్ల సూరిబాబు, నాయకులు కొమ్మినేని నరసింహాస్వామి, మద్దినేని రాంబాబు, గోరిజాల శ్రీనివాసరావు, మాజీ సర్పంచ్ మేకల రాజేష్, బండ్ల పట్టాభిరామయ్య, జమ్ముల అనిల్‌కుమార్, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

యూపీహెచ్‌సీలో మలేరియా మాసోత్సవం

తాడేపల్లి, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): మలేరియా మాసోత్సవం కార్యక్రమంలో భాగంగా తాడేపల్లి డ్రైవర్స్ కాలనీ యూపీహెచ్‌సీ పరిధిలో గురువారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో యూపీహెచ్‌సీ వైద్యులు డాక్టర్ మానస మంజరి మాట్లాడుతూ ప్రస్తుతం వర్షాలు పడుతున్న నేపథ్యంలో మలేరియా, చికున్‌గున్యా, డెంగీ అంటువ్యాధులు ప్రబలే ప్రమాదం ఉందని చెప్పారు. ప్రతిఒక్కరూ ఇంటి పరికరాలను శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. జ్వరం అని తెలిసిన వెంటనే సమీపంలో ఉన్న ఆశా కార్యకర్తను, ఏఎన్ఎంలను కలిసి రక్తనమూనా పరీక్షించుకోవాలని సరైన చికిత్సను తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో యూపీహెచ్‌సీ సిబ్బంది, మలేరియా సబ్ యూనిట్ ఆఫీసర్, సుధీర్, హెచ్‌వీ శ్రీలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు

పెదనందిపాడు, జూన్ 26(ఆంధ్రజ్యోతి): స్థానిక జిల్లా పరిషత్ పాఠశాలలో జిల్లా వైద్యఆరోగ్య శాఖ ఆదేశాల మేరకు గురువారం 7, 8, 9వ తరగతి విద్యార్థులకు పొగాకు వాడకం, దుష్పరిణామాలపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న వైద్యాధికారి ఎస్ నందకుమార్ మాట్లాడుతూ పొగాకు రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దేందుకు ప్రతిఒక్కరూ కృషిచేయాలన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం శ్రీనివాసరావు, సీహెచ్‌వో ఎస్ఆర్ ప్రసాద్‌స్వామి, సూపర్‌వైజర్ చెన్నయ్య, ఏఎం జి రత్నకుమారి, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

ఐసీడీఎస్ ప్రాజెక్ట్ ఆధ్వర్యంలో అంగన్‌వాడీ కార్యకర్తలు, కిశోర బాలికలు డ్రగ్స్ నిషేధంపై అవగాహనా ర్యాలీ నిర్వహించారు.

మంత్రి లోకేశ్‌ను కలిసిన మార్కెట్ కమిటీ



మంత్రి నారా లోకేశ్‌ను కలిసిన మంగళగిరి మార్కెట్ కమిటీ ప్రతినిధులు

మంగళగిరి, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): మంగళగిరి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ జవ్వాది కిరణ్ చంద్‌తోపాటు డైరెక్టర్లు గురువారం ఉండవల్లి నివాసంలో మంత్రి లోకేశ్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. మార్కెట్ కమిటీని నియమించినందుకు మంత్రి లోకేశ్‌కు ధన్యవాదాలు తెలియజేశారు. ఈ సందర్భంగా మంత్రికి జ్ఞాపికను బహూకరించారు. రైతుల సంక్షేమానికి, వ్యవసాయ రంగం అభివృద్ధికి కృషి చేయాలని మంత్రి లోకేశ్ సూచించినట్టు కిరణ్‌చంద్ తెలిపారు. తమపై ఎంతో నమ్మకంతో పదవిని కేటాయించారని, అందుకు తగ్గట్టుగా పనిచేస్తామని, రైతులకు అందుబాటులో ఉండి వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని పేర్కొన్నారు.

జీప్యాట్‌లో చలపతి విద్యార్థులకు జాతీయస్థాయి ర్యాంకులు

తాడికొండ(లాం), జూన్ 26(ఆంధ్రజ్యోతి): జీప్యాట్ 2025 పరీక్ష ఫలితాల్లో లాం చలపతి ఫార్మసీ విద్యార్థులకు జాతీయ స్థాయిలో ర్యాంకులు సాధించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ నాదెండ్ల రామారావు పేర్కొన్నారు. గత నెల 25వ తేదీన జరిగిన జీప్యాట్ 2025 పరీక్షా ఫలితాలను గురువారం విడుదల చేసినట్లు తెలియజేశారు. 8మంది విద్యార్థులు జాతీయ స్థాయిలో ర్యాంకులు సాధించినట్లు తెలిపారు. జే తనూజ భాగ్యశ్రీకి 181 ర్యాంకు, ఈ ఉమామహేశ్వరికు 932వ ర్యాంకు, సీహెచ్ వీర మోహన్‌రెడ్డికి 1384వ ర్యాంకు, వీ.ఫణీంద్రకు 2453వ ర్యాంకు, ఆర్.లక్ష్మీపతికి 3897వ ర్యాంకు, ఆర్ బాలరాజుకు 4607వ ర్యాంకు, ఎస్ చాందినికి 5446వ ర్యాంకు, పీ వినయ్‌కుమార్‌కు 5694వ ర్యాంకులు సాధించినట్లు తెలిపారు. ర్యాంకులు సాధించిన విద్యార్థులను చలపతి విద్యాసంస్థల చైర్మన్ వైవీ ఆంజనేయులు అభినందించారు.

స్టార్టప్ మహాకుంభ్‌లో మంగళగిరి విద్యార్థి ప్రతిభ

- మహిళల కోసం స్మార్ట్ శానిటరీ ప్యాడ్ రూపకల్పన
- విద్యార్థి వంశీని అభినందించిన మంత్రి లోకేశ్



వంశీని అభినందిస్తున్న మంత్రి నారా లోకేశ్

మంగళగిరి, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): ఢిల్లీలో ఈ ఏడాది ఏప్రిల్‌లో జరిగిన స్టార్టప్ మహాకుంభ్ ఈవెంట్‌లో మంగళగిరికి చెందిన విద్యార్థి వనమా వంశీ మహిళల ఆరోగ్యం కోసం మాగ్నా ప్యాడ్స్ పేరుతో స్మార్ట్ శానిటరీ ప్యాడ్‌ను రూపొందించి ప్రదర్శించారు. జాతీయ స్థాయిలో జరిగే స్టార్టప్ మహాకుంభ్ ఈవెంట్‌లో దాదాపు వెయ్యి కళాశాలలకు చెందిన విద్యార్థులు తమ ఆవిష్కరణలను ప్రదర్శించారు. వడ్లమూడి విజ్ఞాన్ కళాశాలలో బీఫార్మసీ ద్వితీయ సంవత్సరం చదువుతున్న వంశీ తన గైడ్ డాక్టర్ పీ.శ్రీనివాస్‌బాబు సహకారంతో స్టార్టప్ మహాకుంభ్ ఈవెంట్‌కు హాజరై మహిళల ఆరోగ్యం కోసం తాను రూపొందించిన స్మార్ట్ శానిటరీ ప్యాడ్‌ను ఆవిష్కరించారు. తన వినూత్న ఆవిష్కరణతో రూ.8 లక్షల నగదు బహుమతిని గెలుచుకుని సౌత్ ఇండియాలోనే ప్రథమ స్థానంలో నిలిచారు. వంశీ ఆవిష్కరణను ఇండియన్ జనరల్ ఆఫ్ పేటెంట్స్‌లో కూడా పబ్లిష్ చేశారు. కాగా, విద్యార్థి వనమా వంశీని రాష్ట్ర ఐటీ, విద్యా శాఖల మంత్రి నారా లోకేశ్ గురువారం అభినందించారు. ఈ మేరకు ఉండవల్లి నివాసంలో వంశీ కుటుంబ సభ్యులను కలిశారు. వంశీ స్టార్టప్ మహాకుంభ్‌లో ప్రతిభ కనబర్చి రాష్ట్రానికి గర్వకారణంగా నిలిచారని మంత్రి లోకేశ్ ప్రశంసించారు. భవిష్యత్తులో అండగా ఉంటామని, అమరావతిలో ఏర్పాటు చేయబోయే రతన్ టాటా ఇన్నోవేషన్ ద్వారా ప్రోత్సాహం అందిస్తామని హామీ ఇచ్చారు.

పారిశుధ్య కార్మికులకు పనిముట్లు అందజేత

తాడేపల్లి (ఉండవల్లి), జూన్ 26 (ఆంధ్రజ్యోతి): ఎంటీఎంసీ పరిధిలోని ఉండవల్లి పారిశుధ్య కార్మికులకు రూ.10వేల విలువైన పనిముట్లను అమ్మ ఫౌండేషన్ జొన్నా శ్రీనివాసరావు గురువారం అందజేశారు. ఆయన మాట్లాడుతూ గ్రామ అభివృద్ధిలో తనవంతు సాయం చేసేందుకు అమ్మ ఫౌండేషన్ ఎల్లప్పుడూ ముందు ఉంటుందని అన్నారు.

ఏఐ, ఎంఐ ద్వారానే నూతన ఆవిష్కరణలకు రూపకల్పన

మేడికొండూరు జూన్ 26 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుత పరిస్థితుల్లో ఏఐ ఎంఐ ద్వారా నూతన ఆవిష్కరణలను రూపొందించవచ్చునని ప్రముఖ చిప్స్ తయారీ సంస్థ ఎన్‌విడియా కంపెనీ సీనియర్ డైరెక్టర్ తురుమెళ్ళ బాబు చెప్పారు. ఎలక్ట్రానిక్ ఇండస్ట్రీ ఫైవ్ పాయింట్ ఓ విజన్‌పై మేడికొండూరు మండలం గుండ్లపాలెంలోని ఎన్నారై ఇంజనీరింగ్ కళాశాలలో గురువారం జరిగిన సదస్సులో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. సదస్సుకు కళాశాల ఎకడమిక్ డైరెక్టర్ కోట శ్రీనివాస్ అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో తురుమెళ్ళ బాబు మాట్లాడుతూ ఎలక్ట్రానిక్స్ రంగంలో ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ కలిపి అభివృద్ధి చేసిన కొన్ని కోట్ల డయోట్స్‌తో నిర్మించిన చిప్స్ ద్వారా అతి తక్కువ ఉద్యోగులతో అత్యధిక అభివృద్ధి సాధ్యపడుతుందని చెప్పారు. ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన కళాశాల అకాడమిక్ డైరెక్టర్ కోట శ్రీనివాస్ మాట్లాడుతూ ఐఐటీ ఖరగ్‌పూర్‌లో ఎలక్ట్రానిక్ విభాగంలో ఎంటెక్ పూర్తి చేసి చిప్ డిజైనింగ్ కంపెనీకి డైరెక్టర్‌గా తురిమెళ్ళబాబు ఎదగడం హర్షణీయమని, ప్రతి విద్యార్థి ఆయనను ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు.

తెనాలి వార్తలు

◆ తెనాలి ◆ పొన్నూరు

పింఛన్‌ను ఆన్‌లైన్ చేసేటప్పుడు జాగ్రత్తలు తీసుకోవాలి

● ఎంపీడీవో విజయలక్ష్మి

కొల్లిపర, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): పింఛన్‌ను ఆన్‌లైన్ చేసేటప్పుడు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఎంపీడీవో విజయలక్ష్మి అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో వెల్ఫేర్ అసిస్టెంట్లతో కొత్తరేషన్‌కార్డులు, పెన్షన్‌లు పంపిణీపై గురువారం ఆమె సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా విజయలక్ష్మి మాట్లాడుతూ రేషన్‌కార్డు దరఖాస్తుకు గడువు అనేది లేదని ఎప్పుడైనా దరఖాస్తు చేసుకోవచ్చునని తెలియజేశారు. పింఛన్లు కూడా సక్రమంగా పంపిణీ చేయాలన్నారు. సమావేశంలో పరిపాలనాధికారి ప్రతాప్‌రెడ్డి, ఈవోపీఆర్‌డీ భార్గవ్ తదితరులు పాల్గొన్నారు.

జూలై 9న సార్వత్రిక సమ్మె

తెనాలి అర్బన్, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): జూలై 9న జరిగే సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి కె.బాబుప్రసాద్ కోరారు. చెంచుపేట ప్రజా సంఘాల కార్యాలయంలో గురువారం జరిగిన సమావేశంలో మాట్లాడుతూ, దేశ వ్యాప్తంగా కార్మికుల హక్కుల రక్షణ కోసం సమ్మె జరుగుతుందన్నారు. ఏ ఒక్క ఫ్యాక్టరీలో కూడా పని జరగకూడదని యంత్రాలు, వాహనాలు ఎక్కడికక్కడే నిలిచిపోవాలన్నారు. ప్రతి యూనియన్ తమ యాజమాన్యానికి సమ్మె నోటీసు అందించాలని కోరారు. నాగేశ్వరరావు, శ్రీనివాసరావు, రవికుమార్, రాధ, మరియమ్మ తదితరులు పాల్గొన్నారు.

మోటార్ వైండింగ్ షాపులో చోరీ

తెనాలి, మారీసుపేట, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): మోటార్ వైండింగ్ షాపులో బుధవారం అర్ధరాత్రి చోరీ జరిగింది. బాధితుడు స్థానికుల కథనం ప్రకారం స్థానిక రైల్వేస్టేషన్ రోడ్డులో మోటార్ వైండింగ్ షాపును బుజ్జి నిర్వహిస్తున్నాడు. రోజు మాదిరిగానే షాపులో పనులు ముగించుకొని తాళాలు వేసి వెళ్లాడు. గురువారం ఉదయం షాపు తాళాలు పగులగొట్టి ఉండంతో లోపలికి వెళ్లి చూసి 70 కేజీల కాపర్ వైరు చోరీకి గురైనట్లు గుర్తించాడు. దీని విలువ సుమారు రూ.80 వేలు ఉంటుందని బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

ఫొటో స్టూడియోలో...

తెనాలి, మారీసుపేట, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): ఫొటో స్టూడియోలో బుధవారం అర్ధరాత్రి చోరీ జరిగింది. బాధితుడు స్థానికుల కథనం ప్రకారం స్థానిక గంగానమ్మపేటలోని వాసవి కాంప్లెక్స్‌లో ఫొటో స్టూడియోను జి.రవి నిర్వహిస్తున్నాడు. రోజు మాదిరిగానే షాపులో పనులు ముగించుకొని గ్లాస్‌డోర్‌కి తాళం వేసి వెళ్లాడు. గురువారం ఉదయం షాపుకు రాగా రెండు కెమెరా కిట్లను గుర్తుతెలియని వ్యక్తులు చోరీ చేశారని గుర్తించారు. చోరీలకు గురైన కెమెరాల విలువ రూ.10 లక్షలు విలువ ఉంటాయని బాధితులు తెలిపారు. చోరీ ఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

శ్రీనిధి బ్యాంకు మహిళలకు వరం: డీఆర్‌డీఏ పీడీ విజయలక్ష్మి

పెదకాకాని, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): శ్రీనిధి బ్యాంకు మహిళలకు వరమని గుంటూరు డీఆర్‌డీఏ ప్రాజెక్టు డైరెక్టర్ టీవీ విజయలక్ష్మి తెలిపారు. గురువారం శ్రీనిధి నుంచి రుణాలు తీసుకొని వ్యాపారం చేస్తున్న మహిళలతో బీహార్ ఆర్థికశాఖ ప్రతినిధులు పుష్పేంద్రసింగ్ తివారి, అశుతోష్ కుమార్ ప్రతినిధులు కలిసి ఆమె పెదకాకానిలోని పలు మహిళా సంఘాలను కలిశారు. ఈ సందర్భంగా విజయలక్ష్మి మాట్లాడుతూ మైక్రో ఫైనాన్స్ ద్వారా పొద్దున రుణాల వలన మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలను తొలగించాలనే ఆలోచనతో ఈ బ్యాంకు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. కార్యక్రమంలో డ్వాక్రా యానిమేటర్లు పాల్గొన్నారు.

కాంట్రాక్టు శానిటేషన్ కార్మికుల ఆందోళన

తెనాలి రూరల్, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని జిల్లా ప్రభుత్వ వైద్యశాలల్లో కాంట్రాక్టు శానిటేషన్ మహిళా కార్మికులు ఆందోళన చేశారు. సూపర్‌వైజర్ సెల్‌ఫోన్ల విషయంలో తమను వేధింపులకు గురిచేస్తున్నారని ఆరోపించారు. కాగా సూపర్‌వైజర్లు మాత్రం విధులలో ఉన్న సమయంలో పనులు చేయకుండా ఫోన్లు చూస్తున్నారని దీంతో ఆసుపత్రిలో శానిటేషన్ లోపిస్తూ రోగులు ఇబ్బందులకు గురవుతున్నారని ఆరోపించారు. దీనిపై ప్రశ్నించినందుకు తమపై ఆరోపణలు చేస్తున్నారని మహిళా కార్మికులు ఆందోళన వ్యక్తం చేశారు.

నేడు మండల ప్రజా పరిషత్ సర్వసభ్య సమావేశం

తెనాలి రూరల్, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): మండల ప్రజాపరిషత్ సాధారణ సర్వసభ్య సమావేశం శుక్రవారం నిర్వహిస్తున్నట్లు ఎంపీపీ ధర్మరాజుల చెన్నకేశవులు ఒక ప్రకటనలో కోరారు.మధ్యాహ్నం 2.30గంటలకు మండల ప్రజాపరిషత్ సమావేశ మందిరంలో జరుగుతుందన్నారు. సభ్యులు, సంబంధిత శాఖ అధికారులు హాజరు కావాలన్నారు.



నట్టల నివారణకు మందు వేస్తున్న పశువైద్యుడు నుజీర్

నట్టల నివారణ మందు పంపిణీ

తెనాలి రూరల్, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): గొర్రెలు, మేకల్లో నట్టల నివారణకు పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో మందులు పంపిణీ కార్యక్రమం గురువారం ప్రారంభించారు. మండలంలోని కొలకలూరు, ఖాజీపేట గ్రామాల్లో జీవాల కాపర్ల వద్దకు నేరుగా కొలకలూరు పశువైద్యులు డాక్టర్ నుజీర్ సిబ్బందితో వెళ్లి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పలువురు వైద్యసిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ప్రశ్నార్థకంగా రహదారి నాణ్యత

● రోడ్డు వేసిన మూడు నెలలకే కుంగిపోతున్న అంచులు
● పటిష్టత లేని మార్జిన్లు ● అధ్వానంగా ప్యాచ్ పనులు



పెదరావూరు-కూచిపూడి మార్గంలో వేసిన రహదారి



దెబ్బతిన్న రహదారి అంచులు

తెనాలి అర్బన్, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): దారుణంగా దెబ్బతిన్న రోడ్లతో ఐదేళ్ల పాటు ప్రయాణికులు నానా ఇబ్బందులు పడ్డారు. కూటమి ప్రభుత్వం రావడంతో పలు మార్గాల్లో దెబ్బతిన్న రహదారులను బాగు చేశారన్న ఆనందం అట్టే నిలబడేలా కనిపించడం లేదు. పలు మార్గాల్లో రోడ్ల నిర్మాణంలో రహదారుల నాణ్యత ప్రశ్నార్థకంగా మారుతోంది. రహదారులు మరమ్మతులు చేసిన మూడు నెలలకే దెబ్బతింటున్నాయి. గుంతలు పూడ్చి ప్యాచ్‌వర్క్ చేసే పనులు కూడా అధ్వానంగా ఉన్నాయి. పెదరావూరు నుంచి కూచిపూడి గ్రామంలోకి వెళ్లే రహదారిని ఇటీవల బీటీ రోడ్డుగా మార్చారు. మూడు నెలలు కూడా గడవకముందే రహదారి అంచులు కుంగిపోయి పాడైపోతున్నాయి. పలుచోట్ల మార్జిన్ల పరిస్థితి ఇలానే ఉంది. మార్జిన్లలో సరైన పటిష్టత చర్యలు తీసుకోకుండా పైపైన రోడ్డువేసి వెళ్లారు. రోడ్డుకు ఇరువైపులా మార్జిన్లకు తోలిన గ్రావెల్‌ను కూడా రోలర్‌తో చదును చేయకపోవటంతో దెబ్బతింటున్నాయి. దీంతో వాహనాలు రోడ్డు మార్జిన్ దిగే క్రమంలో పలుచోట్ల రోడ్డు దెబ్బతింటోంది. తెనాలి నుంచి కూచిపూడి లాకు మార్గంలో రోడ్డు గుంతలమయం కావడంతో వాహనచోదకులు ఈ మార్గంలో వెళుతున్నారు. రహదారి నాణ్యతపై పలువురు విస్మయం చెందుతున్నారు. ఇదేవిధంగా పెదపూడి వంతెన నుంచి ఇంటూరు మార్గంలో ఆర్ అండ్ బీ రహదారి గుంతలకు ప్యాచ్‌వర్క్ పనులు చేస్తున్నారు. సరైన తారు లేకుండా పనులు చేయడంతో పనిచేస్తున్న సమయంలోనే వాహనాల తాకిడికి రాళ్లు లేచిపోతున్నాయి. ప్యాచ్ వర్క్ చేస్తున్న ప్రాంతాల్లో కొన్ని గుంతలను పూడ్చకుండా వదిలి వేస్తున్నారు. పది కాలాల పాటు ఉండేలా రోడ్డు నాణ్యంగా నిర్మించాల్సి ఉండగా అధికారుల నిర్లక్ష్యం గుత్తేదారులకు వరంగా మారింది. అధికారులు, ప్రజాప్రతినిధులు ఈ రహదారులను పరిశీలించి నాణ్యతపై తగిన చర్యలు తీసుకొని ప్రజాధనం వృథా కాకుండా చూడాలని పలువురు ప్రయాణికులు కోరుతున్నారు.

రూ.4.35 కోట్లతో మౌలిక వసతుల కల్పన

ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్రకుమార్



అభివృద్ధి పథకాలు శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే నరేంద్రకుమార్

పొన్నూరు టౌన్, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): పొన్నూరు పురపాలక సంఘంలో ఆర్థిక సంఘం నిధులతో ప్రజలకు అవసరమైన మౌలిక వసతులను సమకూర్చుతున్నట్లు ఎమ్మెల్యే, సంగం డెయిరీ చైర్మన్ ధూళిపాళ్ల నరేంద్రకుమార్ తెలిపారు. గురువారం పట్టణంలోని 25వ వార్డులో 15వ ఆర్థికసంఘం నిధులు 2వ విడతగా మంజూరైన రూ.4.35 కోట్ల వ్యయంతో నిర్మించే పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపన చేసి శిలాఫలకాలను ఆవిష్కరించారు. రూ.2.15కోట్ల వ్యయంతో నిర్మించే 22 సిమెంట్ రోడ్లు, రూ.1.33 కోట్లతో నిర్మించే 12 సీసీ డ్రెయిన్‌లు, రూ.85లక్షలతో నిర్మించే తాగు నీటి పైప్‌ల నిర్మాణానికి ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్లతో ప్రభుత్వం పాలన సాగిస్తోందన్నారు. వైసీపీ పాలనలో సాగిన విధ్వంసం నుంచి వికాసం వైపు రాష్ట్రం చేరుకునేలా పనులు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఎన్నికల హామీలు ప్రజలు తెలియజేసిన సమస్యలు వారికి ఇచ్చిన హామీలు నెరవేర్చేవిధంగా తమ పాలన ఉంటుందని స్పష్టం చేశారు. రాబోయే రోజులలో మరిన్ని నిధులు సాధించి పొన్నూరు పట్టణ రూపురేఖలు మార్చుతామన్నారు. కార్యక్రమంలో జనసేన సమన్వయకర్త వడ్రాణం మార్కండేయబాబు, కమిషనర్ రమేష్‌బాబు, కూటమి పార్టీల నాయకులు, కార్యకర్తలు , ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

మాదకద్రవ్య రహితంగా తెనాలిని తీర్చిదిద్దుకుందాం

● సీఐ రమేష్‌బాబు



తెనాలిలో ర్యాలీ నిర్వహిస్తున్న త్రీటౌన్ సీఐ రమేష్‌బాబు, తదితరులు

తెనాలి రూరల్, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): మాదకద్రవ్య రహిత పట్టణంగా తెనాలిని తీర్చిదిద్దుకునేందుకు ప్రజలు భాగస్వాములు కావాలని త్రీటౌన్ సీఐ ఎస్.రమేష్‌బాబు అన్నారు. గురువారం నషా విముక్త భారత్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా మాదక ద్రవ్యాల వల్ల కలిగే దుష్పరిణామాలను తెలియజేస్తూ సీఐ రమేష్‌బాబు ఆధ్వర్యంలో జేఎంజే కళాశాల విద్యార్థినులతో పట్టణంలో ర్యాలీ నిర్వహించి, ప్రతిజ్ఞ చేయించారు. మాదక ద్రవ్యాలకు బానిసలైన వారు తిరిగి సాధారణ జీవితం గడిపేందుకు ఏర్పాటు చేసిన డీ - అడిక్షన్ సెంటర్ల సేవలపై సీఐ రమేష్‌బాబు అవగాహన కల్పించారు. యువత మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని లక్ష్య సాధనకు కృషి చేయాలన్నారు. నిషేధిత మాదక ద్రవ్యాల రవాణా, వినియోగంపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మాదక ద్రవ్యాల వినియోగం వలన కలిగే దుష్ప్రభావాలపై విద్యార్థులకు అవగాహన కలిగించారు. త్రీటౌన్ సిబ్బంది, జేఎంజే కళాశాల విద్యార్థినులు, పలువురు స్వచ్ఛంద సేవా సంస్థల సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

పొన్నూరులో...

పొన్నూరు టౌన్, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): మాదక ద్రవ్యాలను వినియోగించడం అనర్థదాయకమని పారా లీగల్ వలంటీర్ షేక్ ముజీర్ అన్నారు. మండల న్యాయసేవాకేంద్రం చైర్మన్, మెజిస్ట్రేట్ జి.రుక్మిణి ఆదేశాలతో గురువారం వెంకటేశ్వర జూనియర్ కళాశాలలో అంతర్జాతీయ మాదక ద్రవ్యాల నిరోధక దినోత్సవం నిర్వహించారు. మాదక ద్రవ్యాల వినియోగం వల్ల జరిగే అనర్థాలను విద్యార్థులకు వివరించి ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో కళాశాల ఉపాధ్యాయులు విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.

చేబ్రోలులో...

పొన్నూరు టౌన్ (చేబ్రోలు), జూన్ 26 (ఆంధ్రజ్యోతి): యువత పొగాకు, మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని చేబ్రోలు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ ఊర్మిళ దేవి అన్నారు. గురువారం చేబ్రోలు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో గురువారం ప్రపంచ పొగాకు, మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఎస్ఎన్‌జీ హై స్కూల్ విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు.ఈ సందర్భంగా వైద్యాధికారులు పొగాకు, మాదక ద్రవ్యాలు వినియోగం వల్ల కలిగే నష్టాలను వివరించారు. మాదక ద్రవ్యాల వినియోగించడం వలన కలిగే నష్టాలపై వ్యాసరచన పోటీలు నిర్వహించి విజేతకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో డాక్టర్ శైలజ, వైద్య సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



చేబ్రోలులో జరిగిన ర్యాలీలో పాల్గొన్న వైద్య సిబ్బంది

గ్రామం సుభిక్షం కోసం ప్రత్యేక పూజలు

కొల్లిపర, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రం కొల్లిపరలోని శ్రీదేవి భూదేవి సమేత జనార్దనస్వామి ఆలయం సమీపంలో ఉన్న గరుత్మంతుడు ఉన్న స్తంభాన్ని ఇటీవల లారీ ఢీకొనడంతో ముక్కలుగా విరిగింది. దీంతో గ్రామ పెద్దలు గురువారం పండితులుతో హోమం నిర్వహించారు. గ్రామం సుభిక్షంగా ఉండాలంటూ పండితులు గరుత్మంతుడుకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ పూజల్లో మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. కార్యక్రమంలో ప్రధానఅర్చకుడు జగన్నాథాచార్యులు, కుమారస్వామి, ప్రసాద్, పి.రామలింగేశ్వరశర్మ, నిరంజన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ప్రారంభమైన మోహరం వేడుకలు

పొన్నూరు టౌన్, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): పొన్నూరు పట్టణంలో పీర్ల చావిడి వద్ద గురువారం మోహరం వేడుకలు భక్తి శ్రద్ధలతో ప్రారంభమయ్యాయి. జీబీసీరోడ్డులోని పీర్ల చావడివద్ద ఫకీర్ల మేళతాళాలతో పీర్లను అలంకరించి చావిడిలో ప్రతిష్ఠించారు. అనంతరం ప్రత్యేక ప్రార్థనల నడుమ జెండాను ఆవిష్కరించారు. జూలై 4వ తేదీ వరకు ఈ మోహరం వేడుకలను చావిడి వద్ద నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. కార్యక్రమంలో మోళ్ల వంశసుథలు కరీమ్, హైదర్, గబ్బర్‌బాషా, సందాని, నజీర్, కలీల్‌బాషా, తదితరులు పాల్గొన్నారు.

నేడు టీడీపీ నియోజకవర్గ విస్తృత స్థాయి సమావేశం

తెనాలి రూరల్, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఎన్వీఆర్ ఫంక్షన్ హాల్లో శుక్రవారం టీడీపీ తెనాలి నియోజవర్గ విస్తృతస్థాయి సమావేశం నిర్వహిస్తున్నట్లు పార్టీ వర్గాలు గురువారం ఓ ప్రకటనలో తెలిపాయి. మధ్యాహ్నం 3గంటల నుంచి ప్రారంభమయ్యే కార్యక్రమంలో ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ పాల్గొంటారని నియోజవర్గంలో అన్ని విభాగాల పార్టీ నాయకులు, కార్యకర్తలు, తెలుగు మహిళలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

ఆలయాల హుండీ ఆదాయం రూ.13.81 లక్షలు



హుండీ కానుకలను లెక్కిస్తున్న భక్తులు, సిబ్బంది

పొన్నూరు టౌన్, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని శ్రీసహస్ర లింగేశ్వర స్వామి, శ్రీవీరాంజనేయస్వామి ఆలయాల హుండీల లెక్కింపు గురువారం చేపట్టారు. హుండీల ద్వారా రూ.13.81 లక్షల ఆదాయం సమకూరినట్లు ఆలయ ఈవో గద్దె. వెంకట అమర్‌నాథ్ తెలిపారు. దేవదాయశాఖ ఇన్‌స్పెక్టర్ ఎంగోపి పర్యవేక్షణలో ఆలయ హుండీలను తెరచి లెక్కించారు. మొత్తం 13,81,603 ఆదాయం రాగా, గతేడాది జూన్ నెలలో లెక్కించిన ఆదాయం కన్నా ఈ ఏడాది జూన్‌లో రూ.6,00,749 అధిక ఆదాయం సమకూరినట్లు అధికారులు తెలిపారు. లెక్కింపులో భక్తులు, సిబ్బంది అర్చకులు, తదితరులు పాల్గొన్నారు.

దేశవ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలి

● సీఐటీయూ జిల్లా నాయకుడు శివసాంబిరెడ్డి

కొల్లిపర, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): జూలై 9వ తేదీన జరిగే దేశవ్యాపిత సమ్మెను కార్మికులు విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా నాయకుడు ములకా శివసాంబిరెడ్డి అన్నారు. గురువారం మండల కేంద్రం కొల్లిపర పంచాయతీ కార్యాలయంలో సమ్మెలో పంచాయతీ కార్మికులు పాల్గొంటారని తెలియజేస్తూ సీఐటీయూ నాయకులు జూనియర్ అసిస్టెంట్ లీలాకుమారికి వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా శివసాంబిరెడ్డి మాట్లాడుతూ పెట్టుబడుదారుల ప్రయోజనం కోసం కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కార్మిక వ్యతిరేక లేబర్‌కోడ్స్ తెచ్చిందన్నారు. దీనివలన కార్మికులు తమ కోర్కెలు కోసం సమ్మెచేసే హక్కును కోల్పోతారని పేర్కొన్నారు. కార్మికులకు కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో గోదా సుందరరావు, మల్లోల రమేష్, పొత్తూరు ఏసుపాదం, కొల్లిపర కోటేశ్వరరావు, గోదా ఏసుపాదం తదితరులు పాల్గొన్నారు.

చింతలపూడిలో మోటార్లు ధ్వంసం

పొన్నూరు టౌన్, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని చింతలపూడిలో రోజురోజుకు ఆకతాయిల ఆగడాలు మితిమీరిపోతున్నాయి. పంట పొలాల్లో పంటలకు సాగునీరు అందించేందుకు రైతులు ఏర్పాటు చేసుకున్న మోటార్లను గుర్తుతెలియని వ్యక్తులు ధ్వంసంచేసిన సంఘటన గురువారం వెలుగుచూసింది. గ్రామంలో ముగ్గురు రైతులకు చెందిన మోటార్ల ఫ్యూజ్ బాక్సులు, స్టాటర్‌లు, నీటి పైపులు ఆకతాయిలు ధ్వంసం చేశారు. దీనివల్ల ఒక్కో రైతుకు రూ.5000 నుంచి రూ.10000 వరకూ నష్టం వాటిల్లింది. కొద్దిరోజుల క్రితం కూడా ఇలాంటి సంఘటనలు జరిగాయి. దీనిపై రైతులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

పారిశుధ్యంపై అలసత్వం వహిస్తే సహించేదిలేదు

● మున్సిపల్ చైర్‌పర్సన్ రాధిక



పారిశుధ్య పనులను పరిశీలిస్తున్న చైర్‌పర్సన్ రాధిక తదితరులు

తెనాలి, మారీసుపేట,జూన్ 26 (ఆంధ్రజ్యోతి): పారిశుధ్య పనుల్లో అలసత్వం వహిస్తే సహించేదిలేదని శానిటేషన్ సిబ్బందితో మున్సిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక అన్నారు. గురువారం స్థానిక చెంచుపేట ఉడా కాలనీలో జరుగుతున్న స్పెషల్ శానిటేషన్ పనులను మున్సిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక క్షేత్రస్థాయిలో అధికారులతో కలసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ డ్రెయిన్లు, మురుగు కాలువల్లో వ్యర్థాలను పూర్తిగా తొలగించాలని పారిశుధ్య సిబ్బందిని ఆదేశించామన్నారు. ప్రజలు కూడా చెత్తను డ్రెయిన్లలో వేయవద్దన్నారు. వర్షాకాలంలో వాననీరు పారుదలకు అడ్డంకులు లేకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్ కొమరాబత్తుని జయపాల్, మున్సిపల్ ఇన్‌చార్జ్ కమిషనర్ వీఎం లక్ష్మీపతిరావు, టీపీవో సాంబశివరావు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ లక్ష్మీనారాయణ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



గుంటూరులో జరిగిన కార్యక్రమంలో పాల్గొనేందుకు వచ్చిన సీఎం చంద్రబాబును కలుసుకున్న ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్ర కుమార్

వృద్ధులు, దివ్యాంగులకు

ఇంటి వద్దనే రేషన్ పంపిణీ ప్రారంభం

● తహసీల్దార్ గోపాలకృష్ణ



రేషన్ సరుకులు అందిస్తున్న తహసీల్దార్ గోపాలకృష్ణ

తెనాలి రూరల్, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): వృద్ధులు, దివ్యాంగులకు ఇంటి వద్దకే రేషన్ పంపిణీ ప్రక్రియ ప్రారంభమైంది. ఈ నెల మొదటి వారం నుంచి ప్రభుత్వం రేషన్ షాపుల నుంచి సరుకుల పంపిణీ కార్యక్రమం చేపట్టింది. అందులో భాగంగా వృద్ధులు, దివ్యాంగులకు ఇంటి వద్దకే వచ్చి బియ్యం, ఇతర సరుకులు అందించేలా డీలర్లకు ఆదేశాలిచ్చింది. అందులో కొంత సమస్యలు ఉత్పన్నమవ్వడంతో నెల ప్రారంభానికి వారం రోజుల ముందునుంచి వృద్ధులు, దివ్యాంగుల ఇళ్లకు డీలర్లే వెళ్లి సరుకులు అందించాలని ఆదేశాలిచ్చింది. అందులో భాగంగా మండలవ్యాప్తంగా రేషన్ సరుకుల పంపిణీ కార్యక్రమం గురువారం ప్రారంభమైంది. పలు గ్రామాల్లో రేషన్ పంపిణీని స్వయంగా తహసీల్దార్ గోపాలకృష్ణ పరిశీలించి ఆయన చేతులమీదుగా లబ్ధిదారులకు బియ్యం ఇతర సరుకులు అందించారు. కార్యక్రమంలో గ్రామ వీఆర్వోలు, డీలర్లు తదితరులు పాల్గొన్నారు.

మెడికల్ క్యాంపులను సద్వినియోగం చేసుకోవాలి

● మండల వైద్యాధికారి నీహ



వైద్యపరీక్షలు నిర్వహిస్తున్న వైద్యాధికారులు

కొల్లిపర, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల్లో ఏర్పాటు చేస్తున్న మెడికల్ క్యాంపులను పేదప్రజలు సద్వినియోగం చేసుకోవాలని మండల వైద్యాధికారి నీహ అన్నారు. గురువారం మండల కేంద్రం కొల్లిపరలో వైద్యాధికారులు ఫ్యామిలీ ఫిజీషియన్ కాన్సెప్ట్ క్యాంపును నిర్వహించారు. వైద్యాధికారులు రోగులకు వైద్యపరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేసి తగిన సూచనలు, సలహాలు ఇచ్చారు. ఈ సందర్భంగా నీహ మాట్లాడుతూ మెడికల్ క్యాంపు ఏర్పాటుచేయడం వలన దీర్ఘకాలిక రోగాలను గుర్తించవచ్చునన్నారు. ప్రతినెల నిర్వహించే ఎఫ్‌పీసీ క్యాంపులో మంచంలో ఉన్న వారికి కూడా ఇంటికి వెళ్ళి వైద్యసదుపాయం కల్పించనున్నట్లు తెలియజేశారు. కార్యక్రమంలో ఎమ్ఎల్‌హెచ్‌పీ సుస్మిత, ఏఎన్ఎం లక్ష్మీ, డీఈవో బొమ్ము కోటిరెడ్డి, ఆషా కార్యకర్తలు విజయ, జయప్రద, మల్లేశ్వరి, పద్మ పాల్గొన్నారు.

మారీసుపేటలో వారాహి అమ్మవార్లకు ఉత్సవాలు



వారాహి అలంకారంలో అమ్మవారు

తెనాలి అర్బన్, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని మారీసుపేట శివాలయంలో వారాహి అమ్మవారికి ఉత్సవాలను గురువారం ప్రారంభించారు. శ్రీబాలత్రిపుర సుందరి సమేత చంద్రమౌళేశ్వరస్వామి ఆలయంలో అమ్మవారి ఉత్సవాలు 9 రోజుల పాటు ఘనంగా నిర్వహిస్తారని అర్చకులు నాగఫణిశర్మ తెలిపారు. కమిటీ అధ్యక్షుడు గ్రంధిసేతు మాధవరావు, సభ్యులు పొన్నూరు శశి, వివి శేషగిరిరావు, హరి, అంకమరాజు పాల్గొన్నారు.

పొన్నూరులో...



పొన్నూరులో ప్రత్యేక అలంకరణ

పొన్నూరు టౌన్, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): పట్టణ శివారులోని వరసిద్దివినాయక స్వామి ఆలయంలో గురువారం నుంచి వారాహిదేవి నవరాత్రి ఉత్సవాలు భక్తి శ్రద్ధలతో ప్రారంభమయ్యాయి. మొదటిరోజు వేకువజామున అమ్మవారి ప్రతిమ స్థాపన చేసి పంచామృత అభిషేకాలు నిర్వహించి కలశస్థాపన చేశారు. సాయంత్రం భక్తులతో అర్చకస్వాములు కుంకుమార్చనలు, నిర్వహించారు.



సంపద తయారీ కేంద్రం వద్ద సూచనలు చేస్తున్న ఎంపీడీవో దీప్తి

గ్రామాలను పరిశుభ్రంగా తీర్చిదిద్దేందుకు కృషి

● ఎంపీడీవో అత్తోట దీప్తి

తెనాలి రూరల్, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): ప్రతి గ్రామాన్ని పచ్చదనం పరిశుభ్రతలకు నిలయాలుగా తీర్చిదిద్ది ఆరోగ్యకరమైన వాతావరణంలో గ్రామస్థులందరూ జీవించాలన్నదే ప్రభుత్వ సంకల్పమని అందుకు అనుగుణంగా గ్రామాభివృద్ధికి అవసరమైన కృషి చేస్తున్నట్లు ఎంపీడీవో అత్తోట దీప్తి చెప్పారు. గురువారం మండలంలోని ఎరుకలపూడిలో నిర్మాణంలో ఉన్న చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని ఎంపీడీవో దీప్తి అధికారులతో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా దీప్తి మాట్లాడుతూ గ్రామస్థులందరూ ఇంటా బయట వచ్చే చెత్తను మూడు బుట్టల విధానంలో పారిశుధ్య కార్మికులకు అందించాలన్నారు. వాటిని గ్రామంలోని చెత్తనుంచి సంపద తయారీ కేంద్రాలకు తరలించి ఎరువులు తయారీకి వినియోగించనున్నామన్నారు. కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి, పలుశాఖల అధికారులు పాల్గొన్నారు.

ధాన్యం ఆరబెట్టుకునేందుకు స్థలం పరిశీలన

తెనాలి రూరల్, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): రైతులు పండించిన వరి ఇతర పంటల ఉత్పత్తులను ఆరబెట్టుకునేందుకు అవసరమైన స్థలాలను పరిశీలిస్తున్నట్లు ఎంపీడీవో అత్తోట దీప్తి చెప్పారు. శుక్రవారం మండలంలోని నందివెలుగులో ఎంపీడీవో దీప్తి, తహసీల్దార్ గోపాలకృష్ణ, గ్రామ అధికారులతో కలిసి స్థలాన్ని పరిశీలించారు. స్థానిక అధికారులకు పలు సూచనలు చేశారు.